# అసుర సంధ్య

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

అసురసంధ్య వేళ....

"గాంధీమహాత్ముణ్ణి ఎవరో చంపివేశారట, వదినా !"

"ఆఁ ?"

"ఇందాక రేడియోలో చెప్పారుట."

వీధి అరుగుమీద నిల్చుని పక్కింటావిడతో ఒక ఇల్లాలు అంటున్న మాటలు విన్నాడు శ్రీధర్.

ఎవరినీ ? గాంధీగారినా !! నిజమేనా ?? చప్పున నమ్మకం కలగలేదు. కొన్ని క్షణాలు వాళ్ల వైపు చూస్తూ ఆగిపోయిన శ్రీధర్, పార్కు రేడియోవైపు నడుస్తున్నాడు.

వెనుకనుంచి వడిగా దూసుకువచ్చారు ఇద్దరు పిల్లలు. ఒకడి భుజం శ్రీధర్ కుడిచేతికి గట్టిగా ఢీకొన్నది. భుజాన్ని తడుముకొంటూ ఆగిపోయాడా అబ్బాయి. వానితోబాటు రెండోవాడూ ఆగాడు. ఇద్దరూ వెనక్కి తిరిగి శ్రీధర్‌వైపు చూస్తున్నారు.

"ఫరవాలేదు, వెళ్లండి" అన్నాడు శ్రీధర్.

"ఏమండీ, గాంధీగారు పోయారటండీ, మీకు తెలుసా?" అన్నాడు పెద్ద పిల్లవాడు.

"అవునట ?"

"మీరు రేడియోలో విన్నారా ? ఏం చెప్పారండి ?"

"లేదు .... పార్కు రేడియో దగ్గరకు వెళ్తున్నాను."

"మేమూ అక్కడికేనండి."

పిల్లలిద్దరిలో చిన్నవాడికి ఏడేళ్లుంటాయి. నడుస్తూ ముఖమెత్తి ఆత్రంగా శ్రీధర్‌ను ప్రశ్నించాడు వాడు : "గాంధీగారు చచ్చిపోతే, స్వరాజ్యం పోదా అండీ ?"

అమాయకపు ప్రశ్నకు ఏం చెప్పాలో తోచలేదు శ్రీధర్‌కు. "ఎందుకు పోతుంది ? .... మిగతా నాయకులు లేరూ ? ప్రభుత్వం నడిపేది వాళ్లేగా ? .... అసలు ప్రభుత్వానికీ గాంధీగారికీ సంబంధమే లేదు !.... స్వరాజ్యం ఎందుకు పోతుందీ, పోదు ! .... కాని గాంధీని ఎవరైనా చంపటమేమిటి ?"

"రఘుపతి రాఘవ రాజారాం" భజన విన్పిస్తున్నది పార్కు రేడియోలో.

జనం ప్రవాహంగా పార్కులోకి వచ్చేస్తున్నారు.

రేడియో చుట్టూ పెద్ద గుంపు ....

జనం ముగ్గురుగా, నలుగురుగా అక్కడక్కడా కూర్చున్నారు.

.... ఆత్రంగా, కుతూహలంగా, విచారంగా ....

గాంధి నిర్యాణ వార్తను మళ్లీ ప్రసారం చేసింది రేడియో.

ప్రసారం పూర్తికాగానే సగం జనం వెళ్లిపోయారు. శ్రీధర్‌తో వచ్చిన పిల్లలు ఇంటికి వెళ్లిపోయారు.

రాత్రి తొమ్మిదీ పదిహేనుకు నెహ్రూ, పటేల్ రేడియోలో మాట్లాడతారని ప్రకటన వెలువడింది. శ్రీధర్ కూర్చుండిపోయాడు పార్కులోనే ఒంటరిగా.

మనస్సు గాంధీ మరణించిన అంతిమ దృశ్యాన్ని ఊహిస్తోంది......

పిస్తోలు దెబ్బలతో రక్తసిక్తంగా నేలకు ఒరిగిపోతున్న గాంధీ మూర్తి .... బాధ—రక్తం—మృత్యువు .... లిప్తకాలంలో చైతన్యంలోనుంచి నిశితంగా దూసుకుపోయే ఒక బాధాస్పృహ .... అది మెఱుపులా సోకటం .... ఆత్మనాద స్వరూపమైన 'రాముని' లో ఐక్యం కావటం ! .... నిజంగా అది మహాత్ముని నిర్గమనమే !

నిండు ప్రాణంలో దూసుకుపోయిన ఆ పిస్తోలు గుండు ప్రపంచ చైతన్యంలో నుంచే చొచ్చుకుపోయింది. ఒక్క లిప్తలో—అందుకే యింతమంది హృదయాల్లో గాయం !

"మళీ స్వరాజ్యం పోదాండీ ?"

పసివాని ప్రశ్న హాస్యాస్పదంగా ఉన్నా అందులో నిండి ఉన్న దిగులేదో అది మాత్రం అందరిలోనూ స్పష్టంగా తెలుస్తూనే ఉంది. .... ఇన్నాళ్లనుంచీ ఉంటున్న గాంధీ .... ఇంకెప్పుడూ యిలానే ఉంటాడని ఏదో నమ్మకాన్నీ, భ్రమనూ, కలిగించిన గాంధీ .... ఇప్పుడు లేడనగానే ఏదో అర్థంకాని భయం !—ఈ క్రొత్త పరిస్థితి .... అలవాటు కావటం సులభంకాదు !

హాస్యాస్పదమైన ఆ ప్రశ్న కొక విశేషార్థం కూడా ఉంది. గాంధీ లేకపోతే స్వరాజ్య మేమిటి ? భూమిమీద నడచిన కైలాస శిఖరం గాంధీ; ఆ శిఖరంవైపు అఱ్ఱులు చాచుకుని గర్వంగా నిలబడిన భారతీయులు, వీళ్ల స్వరాజ్యం పొందారు. పొంది సాధించే దేమిటి ? దేశం స్వతంత్రమైంది. ఫలితంగా రక్తపాతం, ద్వేషం, అమానుష ప్రవర్తన, భీభత్సం. "ఈ చీకటిలో నాకు వెలుగు కనిపించటంలేదు." అన్నాడు గాంధీ. ఆయన అన్వేషణ యీ ఆత్మార్పణతో ముగిసిపోయినట్లేనా? ఫలితమేమీ నిలవదా, మిగలదా ? ....

మొదటిరోజులో శ్రీధర్ ఊహలో గాంధీ అంటే కేవలం ఒక నినాదం, ఒక మంత్రం, ఒక ఉద్యమం.

1943 లో ఆయన నిరశనదీక్ష పూనినప్పుడు, తోటి విద్యార్థులతో శ్రీధర్ కూడా ఉపవాసవ్రతం చేసి ప్రార్థనలు చేశాడు. గాంధీగార్ని గూర్చి చదివాడు. గాంధీ ఒక మహోన్నతమైన ఆదర్శంగా మనస్సులో ఆవిష్కరణ జరిగింది.

1945 లో మద్రాసులో బి. ఎస్‌సి. ఫైనల్ చదివే రోజుల్లో గాంధీజీ దర్శనం లభించింది. ముసలితనమే ఒక అపురూప సౌందర్యంగా గాంధీమూర్తిలో దిద్దుకుంటున్నట్లు తోచింది .... అది ముసలితనం కాదు, కేవలం ఆత్మ పరిపక్వత, అది ఒక వెలుగు !

గాంధీ అంటే ఒక ఆదర్శంగా మనస్సులో ఇదివరకు ఏర్పడిన భావం, ఊహ, నిరీక్షణా ఆయన్ని ప్రత్యక్షంగా చూడటంవల్ల ఏమాత్రం భంగపాటు చెందలేదు సరికదా అప్పట్లో కల్పనే యదార్థం నుంచీ రంగుల్ని దిద్దుకున్నట్లయింది. గాంధీగారితో ఏదో వ్యక్తిగతమైన బంధమే ఒకటి ఏర్పడింది తనకు .....

తను గాంధీయుగంలో పుట్టాడు. ఆయుగం నేటితో అంతమైంది. ఇకనుంచి గాంధీ మళ్లీ కేవలం ఒక ఆదర్శం, ఒక నినాదం కాబోలు !

తొమ్మిది గంటలైంది. భూమి నలుమూలల్నించి వచ్చిన సంతాపసందేశాల్ని వినిపిస్తోంది రేడియో.

"అతి సాధువుగా ఉండట మెంత ప్రమాదకరమో !" అని బెర్నార్డుషా వ్యాఖ్యానం. సంతాప సందేశంలోనూ తన్ను తాను మరువలేకపోయాడు షా !

నెహ్రూ రుద్ధకంఠం విన్పించింది. "ఒక పిచ్చివాని అకృత్యం" .... అనంతమైన దుఃఖంలో కోపానికి తావెక్కడ !

రేడియో మూగవోయింది. జనం ఇండ్లకు మళ్లారు.

* * *

"ఏమిటో కడుపులో నొప్పిగా ఉందండీ ఈపూట .... ఇవాళ్టికి మీరు షికారు వెళ్లకపోతే నేం ? సమయానికి మీరు దగ్గరుండకపోతే నాకు భయం వెయ్యదూ ?' అన్నది శ్రీధర్ భార్య తార ఆ సాయంత్రం అతను షికారు బయలు దేరుతూండగా. ఆమెకు ప్రసవించే రోజులు. ఆమెకోసమే పది రోజులు సెలవుతీసుకుని, ఉద్యోగంచేస్తున్న మద్రాసునుంచీ బందరు వచ్చాడు శ్రీధర్.

తారలో అతనికి నచ్చని గుణం: ఆమెకు సత్యంమీద బొత్తిగా గౌరవంలేకపోవటం. నొప్పి లేకపోయినా ఉందని చెబుతుంది ! ఏ మాటల్తో భర్తని లొంగదియ్యాలో, ఎప్పుడెలా నిర్బంధించాలో ఆమెకు బాగా తెలిసిన విద్య. ఆమె మాటలికీ యథార్థానికీ సంబంధమే ఉండదు ! అనుభవంమీద ఈ సంగతి ఎంత బాగా తెలిసి వస్తున్నా, ఎప్పటికప్పుడు ఆమె సమ్మోహనాస్త్రాలు పనిచేస్తూనే ఉన్నాయి. తనమీద కనీసం యీ ఒక్కసారైనా అలా జరక్కూడదనే షికారు బయల్దేరాడు తను .... ఇంతలో గాంధీని గూర్చిన యీ ఘోర వార్త .... తార కోరినట్లు నిజంగా ఆమెతో మాట్లాడుతూ ఉండటానికే అయితే తను ఉండిపోయేవాడే ! కాని ఆమె వంటయింట్లో తల్లిదగ్గర పీటవేసుక్కూచుంటుంది. లేకపోతే అక్కయ్యతో ఆప్యాయంగా కబుర్లు చెప్పుకుంటూ ఉంటుంది. భర్త మాత్రం భద్రంగా వీధి గదిలో కూచుని ఉండాలని ఉద్దేశ్యం. అందుకు ఏవో మాటల్ని వలగా విసరటం: అవి నిజమైనా అబద్ధమైనా, వాటికి అర్థంఉన్నా లేకపోయినా, ముందుకాళ్లకి బంధాలు వేయటమే ఆమె లక్ష్యం.

ఒకవేళ ఆమెకు ప్రసవవేదనే వస్తే తను దగ్గర ఉండి మాత్రం చేసేది ఏమిటి ? నిజానికి ఆమె బంధువులే ఆమెకు ఎక్కువ కావలసినవాళ్లు. వాళ్ల తర్వాతే తన స్థానం. ఒకసారి కాదు, ఎన్నోసార్లు మాటలలో ప్రవర్తనలో అలా రుజువు చేసింది తార. పుట్టింటికి వచ్చిన ఆరు మాసాల్లోనూ ఆమె వ్రాసిన మొత్తం ఉత్తరాల సంఖ్య ఆరు ! ....

తారకు కోపం తెప్పించాలనే షికారు బయల్దేరినా నిండు చూలాలుగా ఉన్న భార్య మనస్సుకి కష్టం కలిగించటం మంచిదా, పోనీ, యీ ఒక్కసారి తను ఆమె మాట మన్నించి ఉంటే ఏం పోయేది ? అనిపించింది. ఎందుకో తనకీ పట్టుదల !

ఇలాంటి సమస్యలేవీ రాకుండా దాంపత్య జీవితం సవ్యంగా ఎందుకని సాగిపోదో ! ఒక మనిషి జీవితమే కాని, ఒక దేశ చరిత్రేకాని సవ్యంగా నడవకపోవటానికి కారణం ఏముంది ? దురదృష్టం, దౌర్భాగ్యం అంతకంటే సరియైన సమాధానమే లేదా ? లేకపోతే ఉన్నట్టుంటి గాంధీగారి నెవరో ఎందుకు హత్యచేయాలి ?

ఇంటి అరుగుమీద నిల్చుని ఉన్న వ్యక్తి శ్రీధర్ సమీపించటంతో లోపలికి వెళ్లిపోయాడు. ఆ వ్యక్తి మామగారు ! తనింకా రాలేదని ఎదురుచూస్తున్నాడా ఏమిటి ? క్రొత్తగా ఉందే ! ....

లోపలికి వెళ్లేటప్పటికి ఎవరూ కనిపించలేదు. శ్రీధర్ కుర్చీలో కూర్చున్నాడు. అయిదు నిమిషాల తర్వాత అతని మామగారైన వెంకయ్యగారు గదిలోకి వచ్చి ఎదురుగా పడక కుర్చీలో కూర్చున్నారు.

"నువ్వు వెళ్లి భోంచెయ్యి. రంగమ్మ వడ్డిస్తోంది... వాళ్లు ఆస్పత్రికి వెళ్లారు." అన్నా డాయన.

మాట్లాడకుండా లేచి లోపలికి వెళ్లాడు శ్రీధర్.

అయితే తారకు ప్రసవవేదన నిజంగానే వచ్చిందన్న మాట ! ఒకసారి అబద్ధం, ఒకసారి నిజం చెప్పేవాళ్లను ఎలా నమ్మటం ? అదేదో కథలో : "పులి" అని రెండుసార్లు ఊరికే అన్నాడట కుఱ్ఱవాడు. మూడోసారి పులి నిజంగానే వచ్చింది. ఎవరూ రక్షించటానికి రాలేదు. ఫలితం కుఱ్ఱవాణ్ణి పులెత్తుకుపోయింది .... దేవుడు మేలుచేస్తే తారకే ప్రమాదమూ రాకూడదు !

పాంటు విప్పి మడిచిపెట్టి ధోవతి కట్టుకున్నాడు. షర్టు మార్చుకోలేదు. భోంచెయ్యగానే ఆస్పత్రికి వెళ్లాలి కాబోలు !

కాళ్ళూ, చేతులూ కడుక్కొని అన్నం ముందు కూర్చున్నాడు.

ఆస్పత్రిలో ఏం జరుగుతూ ఉంటుందో! తను వెళ్ళి ఏం చెయ్యాలి? అక్కడ తన్నెవరూ పలకరించకపోతే ఎలా ఉంటుంది? వెళ్లకపోతే మామగారూ, అత్తగారూ, వదినె ఏమనుకుంటారు? తనకేమీ పట్టదు, తనకు తారమీద ప్రేమ లేదని అనుకుంటారా? తన్నొక వింత మృగంగా చూస్తారా? ఇప్పటికే చూస్తున్నారు, దాని కింకొక వన్నె కలుస్తుంది, అంతే!

"ఏం బాబూ, కూర బాగులేదా? తినటమే లేదు!" అంటోంది రంగమ్మ.

"వీళ్లు ఆస్పత్రికి వెళ్లి ఎంతసేపైంది?"

"ఎనిమిది దాటి ఉంటుంది బాబూ, అప్పుడే అయ్యగారు భోజనం ముగించుకున్నారు, మీరింకా రాలేదే, ఆలస్యమైందనుకుంటూ. అమ్మాయి నొప్పులొస్తున్నయ్యంది. అమ్మగారు గబగబా అన్నంతిని బండి పిలిచింది. ఆస్పత్రికి తీసుకెళ్లిపోయారు. తర్వాత పెద్దమ్మాయి నెమ్మదిగా కావలసినవన్నీ పట్టుకెళ్లారు .... అయ్యగారు ఇందాకనే తిరిగొచ్చారు ..."

"రంగమ్మా, నేనూ వెళ్లాలంటావా?"

"అదేంటండీ, వెళ్లి చూసిరండి .... దగ్గరే .... మొదటి కాన్పు గదండీ, కాస్త ఆదుర్దాగానే ఉంటుంది మరి...."

శ్రీధర్ వెళ్లటానికే నిశ్చయించుకున్నాడు.

అన్నం సయించనేలేదు.... ఏమిటేమిటో అన్నీ ఒక్కసారే జరిగిపోతున్నా యనిపించింది .... విస్తరిముందు నుంచి లేచాడు.

"పెరుగు తెచ్చాను, అంతలోనే లేచారేంటండీ?"

"వద్దు రంగమ్మా, ఆకలి కావటంలేదు..... గాంధీగారు పోయారు విన్నావా? .... పార్కు రేడియో దగ్గర కూర్చున్నాను, ఆలస్యమైపోయింది .... పాపం, రోజూ నువ్వీపాటికి వెళ్లిపోయేదానివి కూడా!"

"అవును బాబూ, దీపాలు పెట్టాక యీ బజార్లో అనుకుంటున్నారు .... ఎవరో కాల్చేశార్ట కాదూ! ఏం కాలం బాబూ! .... మీ రెళ్లిరండి ఆస్పత్రికి .... మంచినీళ్ల చెంబు మీ మంచం దగ్గర పెట్టి పడుకుంటాను."

శ్రీధర్ హాల్లోకి వెళ్లేటప్పటికి వెంకయ్యగారు పేపరు చూస్తున్నారు దీక్షగా .... నిజంగానే చదువుతున్నారా? అన్పించింది శ్రీధర్‌కు. అందులో సంగతులమీద ఆయన మనస్సెలా నిలుస్తోంది! ఒకవైపు గాంధీగారు పోవటం, ఇంకోవైపు కుమార్తె ఆస్పత్రిలో తొలిసారి పురుడుపోసుకుంటూ ఉండటం ఈ రెండిటినీ దాటి ఇంకో విషయంమీద ఎవరికైనా మనస్సెలా పనిచేస్తుందీ, నెమ్మదిగా పేపరు చదవటానికి!

రెండు నిముషాలు కుర్చీలో కూర్చొని నిరీక్షించాడు. మామగారు తలెత్తి చూడలేదు! చివరకు లేచి నిల్చున్నాడు శ్రీధర్.

"శ్రీదేవి నర్సింగ్‌హోంకేనా వెళ్లిందీ? .... నే నట వెళ్లొస్తాను."

పేపరు పక్కకుతిప్పుతూ వెంకయ్యగారు: "ఆఁ? .... ఆఁ!.... అక్కడికే" అన్నారు ప్రత్యుత్తరంగా. తర్వాత పేపర్ని సగానికి మడిచి, అలానే దాన్ని పొట్టమీద పెట్టుకుని, పైకప్పుకేసి చూస్తూ ఉండిపోయారు. మరో మాట లేదు.

ఒక్క క్షణం చూచి, శ్రీధర్ వీధిలోకి వచ్చాడు.

వీధి మాటమణిగింది. అవతల సందులో కుక్క మొరుగుతోంది. ఒక్క సాయంత్రంలో లోకమే మారిపోయిందే! తారకు కోపం తెప్పించి అలా వీధిలోకి వెళ్లాడో లేదో గొప్ప దుర్వార్త వినవలసి వచ్చింది .... తార ఎలా ఉందో!

ఒక వెన్నెలరాత్రి: ట్రిప్లికేనులో మేడమీద అద్దెకున్న పోర్షను వరండాలో ఆరు బయట, సినిమాకు వెళ్లివచ్చి పడుకున్నారు తారా, తనూ. ఉక్కపోసి ఉడికిన దేహం చల్లగాలికి హాయిగా బిరుసెక్కుతూ ఉంటే, దూరాన సముద్రపు హోరూ, తార జడలో జాజిపూల వాసనా, స్వప్నంలాంటి వెన్నెలా .... సినిమాలో హాస్యం గుర్తుకుతెచ్చి మాటిమాటికి కిలకిలా నవ్వుతోంది తార. గిలిగింతలు పెట్టాడు, జడ పట్టుకు లాగాడు, మెడవాటేసుకుని పువ్వుల్లో ముఖం దూర్చి మత్తులో కరిగిపోయేడు .... ఆకాశమూ, వెన్నెలా, సముద్ర ఘోషా, భూమి తాపమూ అన్నీ తనుగా లీనమైన ఒక స్వర్గానుభూతి అది .... అదే హేతువు యీ రాత్రికి, తప్పకుండా ఆ రాత్రే! తనకు గట్టి నమ్మకం.

ఆ రాత్రే, పాపం, నెలలు నిండి యీ రాత్రిగా చీకట్లో ప్రసవవేదన పడుతోంది!

ఒక్కోసారి తను ఆకాశంగా, తార భూమిగా, చీకట్లో గమ్యం తెలీని అన్వేషణలో సమాంతరంగా అలసిపోతే చివరకు నిద్రలో స్పృహ తప్పిపోయేది .... ఒక్కోసారి బాగా పోట్లాడుకుని ఒకరి నొకరు మాటలతో గాయపరచుకుని కన్నీళ్ల పర్యంతమైనప్పుడు చివరకి పరస్పరాలింగన సౌఖ్యమే మనస్సులోని గాయాలకి ఆలేపన మయ్యేది .... లేకపోతే తనకోపం, ఆ మొండితనం, ఒకదాని కొకటి లొంగకుండా యుద్ధంచేసి, దేనికదే భంగపడి సిగ్గుపడి, క్రమంగా ఆరిపోయే చితిలాంటి అనుభవమై మనస్సునే బూడిదగా మార్చేది ....

దాంపత్యానుభూతి రెండేళ్లల్లో ఎన్నో అవతారాల్ని దాల్చింది .... స్త్రీ పురుషుల కలయిక కేవలం శారీరకమూ కాదు, దానికి ఏకరూపమూ లేదు .... అది విచిత్రమైంది, ఎప్పటికప్పుడు విశిష్టమైనదీ, క్రొత్తదీ .... ఎంత తరచినా అర్థంకానిది .... తెలిసినా తెలీనిదీ! .....

ఆ వెన్నెలరాత్రికీ ఈ చీకటిరాత్రికీ పోలికే లేదు. ఆ అనుభూతి పరిపూర్ణతకూ యీలారాత్రి తన మనోవైకల్యానికీ ఎక్కడి పోలిక? .... తల్లిదండ్రులకూ సంతానానికీ పోలికలు ఇదమిత్థమని నిర్ణయంలేదు ఎక్కడా!

గాంధీగారి పితృత్వానికీ స్వరాజ్య శిశువుకీ పోలిక ఉందా?

పుట్టబోయే శిశువు మాత్రం తను కోరినట్లు ఉంటాడా ?

నర్సింగ్ హోమ్‌లో వదినె నాగరత్నమ్మ ఎదురైంది. తార కుద్దేశించిన మంచం ఖాళీగా ఉంది. అత్తగారు కూడా కన్పించ లేదు. నాగరత్నమ్మ శ్రీధర్‌ను చూడగానే : "ఇంకా లేదు .... ఇప్పుడే లోపలికి తీసుకెళ్ళారు .... భయమేం లేదనే చెప్పింది డాక్టరు .... మీరు రావట మెందుకూ ? అవసరమొస్తే కబురు పెడతామని చెప్పొచ్చామే నాన్నగారితో.... రంగన్నను ఇక్కడే ఉంచాము అందుకోసం."

'మీరు రావట మెందుకూ ?' అన్న మాటలో ధ్వనించిన వెటకారాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలీలేదు. దాన్ని గుర్తించనట్లే : "ఎంతసేపైంది మీ రిక్కడకు వచ్చి ?" అన్నాడు.

"తార సాయంత్రమే చెప్పిందటగా మీతో ! అవేమో తొలి నొప్పులు .... తర్వాత అరగంట, గంటకు బాగా వచ్చాయి. మీ రెంతకీ రాలేదు, ఆలస్యం చేశారు .... దానికేమో ఆదుర్దా మీరు దగ్గర లేరని .... 'ఆయ నింకా రాలేదే' అంటూనే ఉంది ఇప్పటిదాకా !"

"ఇప్పుడు చూడవచ్చా ?"

"ఇప్పు డెలా చూస్తారూ ?" దీర్ఘంతీసింది. శ్రీధర్ ప్రశ్న ఎంత తెలివితక్కువగా ఉందో కంఠంలో ధ్వనింపజేసింది.

శ్రీధర్‌కు ఇక అక్కడ ఉండటానికి మనస్కరించ లేదు. లేచాడు.

"నే ననుకోలేదు .... నిన్నా మొన్నా కూడా 'ఎలానో ఉంది' అంటూనే ఉంది కదా , ఇవాళ అయితే కాబోలు ననుకున్నా."

"రోజా అంతే ఎలా అవుతుందీ ? .... ఎప్పుడో, ఏ క్షణమో ! .... నెలలూ రోజులు నిండాక ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలిసిందే !"

"నేను వెళ్ళనా ?"

"వెళ్ళక మీరుండి చేసేదేమిటి ? వెళ్లి పడుకోండి, తెల్లారాక చూద్దురుగాని మీ సుపుత్రుణ్ణి !"

సిగ్గుతో నవ్వాడు శ్రీధర్. ఆ చివరి మాటలో ధ్వనించిన సద్భావానికి కొంత తృప్తి కలిగింది .... ఇంటికి బయల్దేరాడు.

'రోజా అంతే ఎలా అవుతుందీ ? ఎప్పుడో ఏ క్షణమో అని సిద్ధంగా ఉండాల్సిందే' .... అయితే ఆ పులి కథలో తప్పు వెళ్లనివాళ్ళదే గాని, కుజ్జివాడిది కాదన్నమాట ! కుజ్జివాడి కుజ్జితనాన్ని వాళ్ళు సరిగా అర్థం చేసుకోలేదు ! చిన్నతనంలో పుస్తకాల్లో నేర్చుకున్న నీతులు జీవితంలో తిరగవేసి నేర్చుకోవాలి కాబోలు ! లేకపోతే జీవితం అర్థంకాదు !

ఆస్పత్రినుంచి తిరిగివచ్చి పడుకున్నాడు శ్రీధర్.

కన్నులు మూసుకొంటే రక్తపు మడుగులో పడిపోయిన గాంధీ కనిపిస్తున్నాడు. అంతలో స్పృహ జారుతూ, గాంధీ బదులు తార రక్తపు మడుగులో ఉన్నట్లూ బాధగా 'రామా' అని మూలుగుతున్నట్లూ ..... తార ముఖం స్పష్టంగా కనిపిస్తూ అందులో ఒక క్రొత్త వన్నె స్ఫురిస్తోంది.... మెలకువ .... ఆలోచన ప్రారంభం.... నిద్ర రావటంలేదు అతనికి.

తార వ్యక్తిత్వంలో యిదివరకు కనపడని ఒక ఉదాత్తత గోచరిస్తోంది .... మాతృత్వాన్ని పొందుతున్న తార, పుట్టబోయే శిశువుకోసం రక్తంతో ఆత్మార్పణ చేస్తున్న తన భార్య, తను సాధించలేనిదాన్ని దేన్నో సాధిస్తున్నది. యమునితో పోరాడిన సావిత్రిలా మృత్యువుతో నోటిలో తల దూర్చి, ఈ లోకపు జీవితానికి అవతలి గట్టు నుంచి ఒక శిశువును, ఒక దేవతామూర్తిని, ఒక అమృతకలశాన్ని తనకోసం సంగ్రహించుకొని వస్తోంది' ; తన కందీయబోతోంది !.... ఆమె తప్పుల్ని లెక్కించటానికీ, ఆమె లోపాల్ని విమర్శించటానికి తనెవ్వరు ?

## 2

తెల్లవారి లేవగానే రంగమ్మ కబురు చెప్పింది. తార ఆడపిల్లను ప్రసవించిందని. రంగన్న వార్త తీసుకొచ్చి ఆస్పత్రికి కాఫీ వగైరా పట్టుకు వెళ్లాడట. తర్వాత అత్తగారు వచ్చి వెళ్లారట. మామగారి జాడ లేదు. నిద్ర లేచారో లేదో మరి !

కొడుకే పుడతాడని ఎందుకో శ్రీధర్‌లో చాలా నాళ్ళుగా ఏర్పడిపోయిన నమ్మకం, అది వట్టిదై పోయింది. అన్నయ్యకు ఇద్దరు ఆడపిల్లలు: శ్యామల, సీత. అందుకే కాబోలు మగపిల్లవాడు కావాలని తనకు కోరిక. ఈవార్త తన వాళ్లకేమీ ఉత్సాహం కలిగించబోదు. ఏమైనా తనకు ఒక ఆడపిల్ల, కొమార్తె ! ఇకనుంచీ అలా అలవాటు పడాలి.

స్నానం వగైరా పూర్తిచేసుకొని దుస్తులు వేసుకొనేటప్పటికి రంగమ్మ టిఫిన్, కాఫీ, సిద్ధంగా ఉంచింది.

"తొలికాన్పు లక్ష్మిందేవి పుట్టటంవే అదురుష్టం బాబూ !" అంటోంది రంగమ్మ సంతోషాన్ని రేకెత్తింపజేయాలనే ఉద్దేశంతో. 'రంగమ్మ హృదయం మంచిది' అనుకున్నాడు శ్రీధర్.

అతను ఆస్పత్రికి చేరుకునేటప్పటికి అత్తగారు పాప పొత్తిళ్లను సర్దుతోంది. తార ఆసక్తిగా, శ్రద్ధగా, కించిత్ గర్వంతో గమనిస్తోంది. శ్రీధర్ వెళ్లి నిలబడగానే తార కళ్ళు అతనివైపు తిరిగి లిప్తలో మళ్లీ ప్రక్కకు తిరిగాయి. అత్తగారు అతన్ని పలకరించకుండానే గదినుండి బయటకు వెళ్లిపోయింది. మాట్లాడకుండా తార కళ్ళు మూసేసుకున్నది.

దగ్గరకు వెళ్లి ఆ చెంపనుముని వేళ్లతో తాకాడు.

"కోపమా ?"

ముఖం తప్పించింది తార.

"నన్ను తాకుతా రెందుకు ?.... అదుగో పాప, చూడాలంటే చూడండి !"

పాప దగ్గరకు వెళ్లాడు. వంగి పరీక్షగా చూశాడు. చాల చిన్నగా, లేతగా, మసగ్గా, ఎఱుపుగా, కానుగచెట్టులో అప్పుడే విచ్చిన చిగురుటాకు మల్లే నవనవలాడుతూ కోమ

లంగా ఉంది ! తాకాలనిపించింది. సాహసించలేకపోయాడు. పిడి కిళ్ళు మూసుకుని ఆ రెండు బుల్లిచేతుల్ని చెవులకు దగ్గరగా పెట్టుకొని వెల్లకిలా పడుకొన్న ఆ బొమ్మ "ఇదుగో నీకోసం ఏం తెచ్చానో చెప్పుకో" అని చేతులెత్తి తనను పిలిచి కవ్విస్తోంది! మళ్లీ చప్పున చిలిపిగా కళ్లు మూసికొని నటిస్తోంది ! ఊహిస్తూ శ్రీధర్ నవ్వుకున్నాడు.....

ఏం తెచ్చిందో యీ పాప తనకోసం ? ఎందుకు వచ్చిందో అవతలిగట్టునుంచి యీ లోకానికి ? వైతరణి అంటారే ఆ చీమూ నెత్తురు నదిని ఎలా దాటి ఎంత శ్రమ పడి వచ్చిందో ? తన్ను కవ్వించటానికేనా ? ....

"ఏమిటూ_చిదానందం ? చాల సంతోషిస్తున్నట్లున్నారే!" అన్నది అతణ్ణి తదేకంగా గమనిస్తున్న తార.

ఆ 'చిదానందం' అన్న పదాన్ని అతనెప్పుడు సంతృప్తిగా సంతోషంగా ఉన్నట్లు కన్పించినా ప్రయోగిస్తుంది తార. అదొక వెక్కిరింపు !

"నీ యీ ఘనకార్యానికి చిదానందమే మరి !" అన్నాడు. అతని మనస్సు యుద్ధ సన్నద్ధంగా మారింది. మరచిపోబోతున్న ఆశాభంగమే అస్త్రంలా పనికివచ్చింది ఆమెమీద ప్రయోగానికి.

"ఆ ! ఎవరి ఘనతో తెలుస్తూనే ఉంది !" అని ముఖం శ్రీధర్‌కు కనిపించకుండా అటువైపు తిరిగి పడుకొన్నది తార ... .... ఆమె కంఠంలో తొణికిన దుఃఖం, ఆమె కన్నీళ్ల పర్యంతం కావటం, అతణ్ణి పూర్తిగా ఓడించేశాయి. ఊహించలేదు యింత చప్పున 'నేనే దాసోహం' అనవలసి వస్తుందని ......

పాపను విడిచి ఆమె దగ్గరకు వెళ్లాడు. ఆమె తల స్పృశించాడు.

"నిజంగా నాకేం కొరతలేదు తారా ! నా క్కావలసింది కూతురేనని పాపను చూడగానే తెలుసుకున్నాను .... అందుకే నాకు సంతోషంగా ఉంది .... పాప ఎంత చక్కగానో ఉంది కదా బొమ్మల్లే !"

తార కళ్లు తుడుచుకుని ఏం మాట్లాడలేదు.

"నామీద కోపంగా ఉందా నీకు ?" అన్నాడు.

ఆమె ఇటువైపు తిరిగి పాప వంక చూస్తూ : "మీరు నిన్న సాయంత్రం వెళ్లకుండా నా దగ్గరే ఉన్నట్లయితే అబ్బాయే పుట్టేవాడు ..... అని నా నమ్మకం" అన్నది.

"ఎన్నో నెలల క్రితం ఆ సంగతి ఏర్పడిపోయి ఉంటుంది తారా !"

"ఏమీ కాదు ! అదంతే ! మీ ప్రయోజకత్వం, కబుర్లు చెప్పటానికీ, వాదించటానికీ అయితే సరి ! నిన్న వెళ్లకపోతే ఏం మునిగిపోయేది ? నామీద కచ్చకు వెళ్లారుగాని ...."

"నిన్న గాంధీగారు పొయ్యారు, తెలుసా నీకు ?"

"పోతే పోయారు, నాకేం ?"

"ఏమిటా మాట ! లోకమంతా దుఃఖిస్తూంటే నీ కొక్క దానికే విచారంలేదు ! ఎప్పుడూ నువ్వూ నీ సంగతే ! వీధిలో జనం గుంపులు గుంపులుగా రేడియోల దగ్గర మూగి వింటున్నారు. కొట్లూ, హొటళ్లూ అన్నీ కట్టేశారు. రేడియోలో దేశ నాయకులు గాంధీకి జోహార్లు అర్పిస్తున్నారు.... నిన్న సాయంత్రము ఎంత ఘోరం జరిగిందో, లోకం ఎంత విచారిస్తోందో ఊహించుకోలేవా ?"

"అయితే మిమ్మల్నిక్కడ ఉపన్యాస మిమ్మన్నారు కాబోలు! మీరూ వెళ్లి ఆ రేడియోలోనే మాట్లాడండి. నాకు అలసటగా ఉంది, నేను నిద్రపోవాలి !"

ఆమె నిద్ర కుపక్రమించింది.

తనకు ముఖ్యమైనవేవీ ఆమెకు ముఖ్యం కాదు. అయినా యింత తిరస్కారభావ మేమిటీ ?

"నేను వెళ్తున్నా. సాయంత్రం రమ్మంటావా ?"

కళ్లు తెరచి చురుగ్గా చూచింది. విసురుగా:

"మీ యిష్టం ! .... సాయంత్రం మీటింగేమైనా ఉంటుందేమో వెళ్లండి, ఎలా వస్తారు ?" అని మోచేయి నొసటి మీదుగా వేసుకున్నది నిద్రించే ప్రయత్నంలో తార.

శ్రీధర్ మళ్లీ పాపాయి దగ్గర ఒక్క క్షణం నిల్చుని చూచి తర్వాత గది వెలుపలికి వచ్చేశాడు.

"ఏమిటి, అప్పుడే వెళ్లిపోతున్నారు, మరదిగారు ?" అంటూ వరండాలో వస్తూన్న నాగరత్నమ్మ శ్రీధర్‌ను చూచి అన్నది.

ఒక్కొక్కసారి తెచ్చిపెట్టుకున్న ఆప్యాయతతో ఆమె పలకరించటం, అది ఏదో ఎత్తిపొడుపుకు ఉపోద్ఘాతమేనని శ్రీధర్‌కు తెలుసు.

"తార నిద్రపోతా నన్నది, వచ్చేశాను."

"పాపను చూశారా అచ్చం తమ పోలికే ! .... ఆడ పిల్లకు తండ్రిపోలిక రావటం అదృష్టమే అంటారు మరి !"

"ముక్కూ మొహం ఏర్పడకుండానే పోలికలేం తెలుస్తాయి?" అన్నాడు ఆత్మరక్షణోపాయంగా.

"తెలిసినవాళ్లకి గాని తెలీదు... ఆ ముక్కూ, గెడ్డం, రంగూ అన్నీ మీవే, మావి కావు !" దీర్ఘంతీస్తూ అంది.

ఆమెను చాచి లెంపకాయ కొట్టాలన్నంత కోపం వచ్చింది శ్రీధర్‌కు. ఒక్క చూపు చూచి, మాట్లాడకుండా బయల్దేరాడు.

రంగు అనటంలో ఆమె ఆక్షేపణేమిటో బోధ పడ్డది. తన రంగు తక్కువ, తార చాయ ఎరుపు. తనకు ఆడపిల్ల, చాయ తక్కువ ఆడపిల్ల, కలిగిందని ఈసడింపు!

* * *

బారసాలకు ముందే మద్రాసు బయల్దేరవలసి వచ్చింది. శ్రీధర్ అమ్మాయికి 'విద్య' లేక 'ఉమ' అని పేరు పెట్ట వలసిందని సూచించాడు. భార్య, వదినె యిద్దరూ కూడా సుముఖంగా లేరు. 'స్వరాజ్యం', 'ప్రేమాంజలి' వాళ్లు ఎన్నిక చేసిన పేళ్లు. చివరకు 'స్వరాజ్యం' అన్న పేరు ఆమోదించి రాజీ పడ్డాడు.

ఈ పర్యాయం వచ్చినప్పటినుంచీ చాల ముక్తసరిగా వ్యవహరించిన మామగారు, శ్రీధర్ ప్రయాణమౌతున్న రోజున అకస్మాత్తుగా ప్రస్తావించాడు ఉద్యోగం విషయం.

"ఉద్యోగం ఖాయం చేశారా ?"

"ఇంకా లేదు."

"అసలు మన తాహతుకి గుమాస్తా ఉద్యోగం ఏం సరి పోతుందీ ?"

శ్రీధర్ బిగిశాడు. ఈ విషయమై చాల కథే జరిగింది. ఇక మామగారు ఆ ప్రసక్తి తీసుకురారనే నమ్మకానికి వచ్చాడు శ్రీధర్. కాని, ఉన్నట్టుండి మళ్లీ ఆ సంగతి యీవిధంగా తీసుక రావటం అతనికి ఆశ్చర్యం కలిగించింది.

"ఖాళీగా కూచోవటంకన్న అదే నయం, ఇంకోటి దొరికే దాకా !" అన్నాడు. చివరిమాట, తనేం పెద్ద ఉద్యోగం వస్తే నిరాకరించలేదనీ, తనది మొండిపట్టు కాదనీ సూచించటానికే అన్నాడు.

"చిన్నవాటిల్లో జొరబడ్డ తర్వాత పై ఉద్యోగాలు ఎలా దొరుకుతాయి ? అందులోనే ఉండమంటారు ఎవరి నడి గినా. అసలు వెళ్లి అడగటానికే యిబ్బంది ! .... మీ అల్లుడేం చేస్తున్నా డిప్పుడు? అన్న ప్రశ్న కేవిటి జవాబు ? చెబితే వెంటనే చప్పరించేస్తారు: అబ్బే అంతకంటే శుభ్రంగా వ్యవ సాయమే చూచుకోవచ్చుగా అని. బి. ఎస్. సి చదివి గుమాస్తా గిరీ ఏవిటండీ ? అనటమే ఎవరు కనిపించినా ! .... ఇలా ఉంటే ఇంకో ఉద్యోగం ఎలా వస్తుంది ? ఎప్పటికీ రాదు, ఇంతే !"

"అయితే ఏం చెయ్యమంటారు ? ఉద్యోగం లేకపోతే వ్యవసాయమే చూచుకుంటాను...."

"మీవైపు వ్యవసాయంచేస్తే ఏం వొరుగుతుంది ? మీ అన్నయ్య చేస్తున్నాడు, ఏం గిట్టుతోంది ? అంతకంటే గుమాస్తా ఉద్యోగమే నయం, గుడ్డిలో మెల్ల !"

ఈ మాటల ఆంతర్య మేమిటో బోధపడుతోంది. తను వ్యవసాయం మామగారింటి దగ్గరుండి చెయ్యాలి ! ఆ స్థితికి మెల్లగా ఒప్పించటానికే నన్నమాట యింత పన్నుగడ, పంతం, సూటీ పోటీ మాటలూ, ఒత్తిడీ, ప్రచ్ఛన్నయుద్ధం, అన్నీ !

శ్రీధర్ మాట్లాడకుండా లేచి గదిలోంచి వెళ్లి పోయాడు.

దీనికి నాంది అసలు పెళ్లిమాటలు జరిగినప్పుడే ఉన్నట్లు అర్థమౌతోంది శ్రీధర్‌కు.

ఆరోజు సాయంత్రం—మద్రాసులో హిందీ ప్రచారసభ మైదానంలో గాంధీగారిని చూచి ఆలస్యంగా హాస్టలు చేరుకున్న సాయంత్రమూ అదే !— ఇద్దరు పెద్దమనుష్యులు, కృష్ణా జిల్లా వాళ్లు, ఖద్దరు వస్త్రధారులు ప్రక్కగదిలో తనకోసం నిరీక్షిస్తున్నారని తెలిసింది. మిత్రుడు ప్రసాద్ వాళ్ల విషయం తనతో అదివరకే ప్రస్తావించాడు. అందులో ఒకరు రామినీడు గారని భూస్వామి; డబ్బు పలుకుబడి గల మనిషి. రెండవ వ్యక్తి ఆయన బావమరిది వెంకయ్యగారు. స్కూలుఫైనలు పూర్తి చేసిన తారను, వెంకయ్యగారి చివరి సంతానాన్ని తనకు ఇవ్వా లన్న ఉద్దేశ్యం వ్యక్తపరిచారు. శ్రీధర్ కుటుంబాన్ని గురించి కొంత సూటిగానూ, కొంత లౌక్యంగానూ ప్రశ్నించారు. రామినీడుగారు, వెంకయ్యగారు ఏమీ మాట్లాడలేదు. వివాహ విషయంలో బాధ్యత సర్వమూ తన తండ్రిదేనని, ఆయన నిర్ణయమే తన నిర్ణయ మౌతుందనీ వాళ్లతో అన్నాడు శ్రీధర్ సవినయంగా.

"నయమే ! మా జిల్లా కుఱ్ఱవాళ్లలా బరితెగించిపోయి పెద్దవాళ్ల లెక్కేమిటంటూ మాట్లాడటంలేదు !" అన్నారు రామినీడుగారు నవ్వుతూ, సాభిప్రాయంగా వెంకయ్యగారి వైపు చూచి.

ఆ వ్యాఖ్యానం తనకు నచ్చకపోయినా బదులు చెప్పలేదు. కాని, ఆ మాటల కొక వింత అర్థం యివాళ స్ఫురిస్తోంది !

"బి. ఎస్‌సి. తర్వాత ఏం చేయాలని ఉద్దేశం ?" అని ప్రశ్నించారు రామినీడుగారు.

"ఇంకా ఏమీ నిశ్చయించుకోలేదు."

అప్పుడు వెంకయ్యగారు ప్రథమంగా నోరు విప్పారు:

"ఏదైనా ఇండస్ట్రీలో చేరితే చదివిన డిగ్రీకి ఉప యోగం ఉంటుంది. మంచి భవిష్యత్తూ ఉంటుంది..... ఏమంటారు బావా ?" రామినీడుగారు ఆమాటకు తల పంకించి తటస్థంగా వూరుకున్నారు. ఏమీ బదులు చెప్పలేదు.

1946 వేసవిలో అయిదువేల కట్నంతో వివాహం జరిగింది.

తర్వాత ఆరు నెలల కాలం ఉద్యోగాన్ని అరటిపండొలిచి అరచేతిలో పెట్టినట్లే మాట్లాడారు అత్తవారు. రామి నీడుగారు పెద్ద భాగస్వామిగా ఉన్న పంచదార ఫ్యాక్టరీలో శ్రీధర్‌కు ఉద్యోగం వేయించటం .... తర్వాత ఫాక్టరీ ఖర్చు మీదే ట్రెయినింగ్‌కి భార్యతో సహా విదేశాలకు వెళ్లిరావటం... తర్వాత తర్వాత క్రమంగా ఏ ఫాక్టరీ మానేజరుగానో, మానే జింగ్ డైరెక్టరుగానో శిఖరారోహణ చెయ్యటం .... ఈ పథ కాన్ని అరచేతిలో వైకుంఠంగా చూపిస్తూనే ఉన్నారు వెంకయ్య గారు .... చివరకు అన్నీ గాలిమేడలుగానే తేలిపోయాయి.

అది శ్రీధర్ దురదృష్టమో, లేక రామినీడుగారి ధర్మ పత్ని అంటే వెంకయ్యగారి సోదరి పదేళ్ల క్రితమే మరణించి ఆయన రెండవ వివాహం చేసుకొని ఉండటమే కారణమో, రామినీడుగారు మాత్రం వెంకయ్యగారికి మాట సాహాయ్యం మినహా యింకే సాహాయ్యమూ చెయ్యరనీ, చేసే ఉద్దేశం కూడా లేదనీ శ్రీధర్‌కు స్పష్టంగా బోధపడ్డది. కాని, 'చెయ్యను' అన్న మాట మాత్రం కఠినంగా నోటివెంట ఎన్నడూ చెప్పరు రామినీడుగారు. అలా చెప్పటం ఆయన తత్త్వంకాదు !

రెండు పర్యాయాలు శ్రీధర్‌ను వెంటబెట్టుకొని విజయ వాడకు రామినీడుగార్ని చూడటానికి ఉద్యోగప్రయత్నంమీద వెళ్లారు వెంకయ్యగారు. రెండుసార్లూ బంధు మర్యాద, కబుర్లు, జరిగాయి. అసలు విషయం మాత్రం యీాయన గట్టిగా అడగలేదు, ఆయన చెప్పలేదు ! శ్రీధర్‌కి యిదేమీ నచ్చలేదు. కేవలం బంధుమర్యాదగా వెళ్లితే బాగుండేది, లేక

పోతే వ్యవహారంకోసం వెళ్లినట్లుగా సూటిగా అడిగి సంగతి నిక్కచ్చిగా తేల్చుకున్నా బాగుండేది. ఎటూకాని సందిగ్ధావస్థ శ్రీధర్‌కు కష్టమనిపించింది. మూడవసారి రామినీడుగారి వద్దకు రమ్మని వెంకయ్యగారు పిలిచినప్పుడు తనకు అలా రావటం యిష్టంలేదని మొహమాటం లేకుండా చెప్పేశాడు శ్రీధర్. అంతటితో ఆయనకూ, ఆయన ఇంటిల్లపాదికీ కోపం వచ్చింది. తారకూ అసంతృప్తి కలిగింది.

రామినీడుగారు ఉద్యోగం వేయించకపోవటానికి కారణం శ్రీధర్ దురభిమానం, ఉలిపికట్టెతనం, శ్రీధర్‌కు పైకి రావాలన్న అకాంక్ష, ఆశయం లేకపోవటమే అంటూ వ్యాఖ్యానం ప్రారంభమైంది.

పెళ్లయి ఎనిమిది నెలలు యిలా గడిచిన తర్వాత, స్వయంగా ప్రయత్నించి మద్రాసులో సివిల్ సప్లయిస్ శాఖలో, లోయర్ డివిజన్ గుమాస్తాగా ప్రవేశించాడు శ్రీధర్. ఉద్యోగం తాత్కాలికం. అసలు ఆ శాఖనే తాత్కాలికం అన్నారు. ఇదికూడా శ్రీధర్ అత్తవారి యీసడింపుకు గట్టి కారణమైంది. ఫాక్టరీలో పెద్ద ఉద్యోగం వేయిస్తామంటే వద్దని మంకుపట్టు పట్టి ఇంతలో మునిగిపోయినట్లు మద్రాసులో గుమాస్తాగా కాలక్షేపం చెయ్యటానికి నిశ్చయించుకోవటం అది స్వతః హుందాతనం లేకపోవటమే కారణమనీ, అల్లుడికి తాహతంటే ఏమిటో తెలీదనీ, వ్యాఖ్యానిస్తూ ప్రతి మాటలో చేతలో తమ విమర్శని వ్యక్తం చెయ్యటం ప్రారంభించారు అత్తవారు.

మద్రాసు ఉద్యోగం తాత్కాలికం కావటంతో అది ఎప్పుడో ఊడిపోతుందనీ, తర్వాత అల్లుడు తమ ఆశ్రయం ఎలానూ కోరవలసి వస్తుందనీ వాళ్ల నమ్మకం కాబోలు ! అప్పుడు మిగిలేది యిల్లరికపు టల్లుడుగా వ్యవసాయం చూసుకోవటమే నని వాళ్లొక అభిప్రాయానికి వచ్చినట్లున్నారు. ఆ అభిప్రాయమే యిప్పుడు మామగారు స్పష్టం చేశారు.

తన మానాన్ని తనను ఉండనివ్వకుండా ఏమిటీ హింస ? వీళ్లు తనకు పెద్ద ఉద్యోగం వేయిస్తే తనేమీ నిరాకరించ లేదు. వేయించలేదే అని అలిగి యుద్ధమూ ప్రకటించలేదు. తన జీవితమేదో తను చక్కదిద్దుకోవటానికి మాత్రమే ప్రయత్నిస్తున్నాడు. కాని, అందుకు అడ్డు తగులుతున్నారు. తనకూ తన భార్యకూ మధ్య పొరపొచ్చాలు కల్పిస్తున్నారు కూడా !

రామినీడుగారు వీరి ఆశల్ని సఫలం చెయ్యకపోతే దానికి తనెట్లా కారణం ? కాని, అందుకు తనే కారణమైనట్లుగా ప్రవర్తిస్తున్నారు .....

మగశిశువుకు బదులు ఆడపిల్ల కలగటం తను బుద్ధిపూర్వకంగా చేసిన తప్పిదమా ? ఆ శిశువు చామనచాయ గా ఉండటం కూడా తన ప్రయోజకత్వమేనా ?

"అదృష్టవంతులైతే అన్నీ అమరుతాయి తల్లీ !" అంటోంది అత్తగారు నిష్ఠూరంగా, ఏదో చిన్న విషయమై తారతో మాట్లాడుతూ తను వినేట్టుగా.

తన తప్పిదమూ, తన అప్రయోజకత్వమూ, తను దురదృష్టవంతుడు కావడమే నట ! ఇంతకూ ఏమిటీ తన గొప్ప దురదృష్టం అంటే—తనపట్ల వాళ్లు కన్న కలలూ, కట్టిన గాలిమేడలూ వ్యర్థమై పోవటం ! ......

రైలు వెడుతూఉంది చీకటిని చీల్చుకొంటూ ....

శ్రీధర్ చీకట్లోకి చూస్తూ కూర్చున్నాడు క్రిక్కిరిసి ఉన్న ఆ మూడవ తరగతి పెట్టెలో ....

తెల్లవారితే మద్రాసు .... ఆఫీసు .... లాడ్జి .... యధా కార్యక్రమం.....

కాని యీ పది రోజుల్లో ప్రపంచం ఎంతో మారి పోయినట్లే .....

గాంధీగారు పోయారు.

తన బాధ్యత పెరిగింది.

తనిప్పుడు తండ్రి, కుటుంబీకుడు, తనకు ఆత్మగౌరవం ఉంది. తనకు స్వరాజ్యమనే బుల్లి పాపాయి ఉంది. అది అంతా తన పోలికే, తనలానే నలుపు ! ,పిడికిళ్లు మూసి పెట్టుకుని, తనకోసం అవతలిగట్టు నుంచి ఏమిటో తెచ్చింది... ఏమి తెచ్చిందో ?

## 3

గుహముందు నిల్చుని పులి, గాండ్రుమంటూ, జ్యోతుల్లా మెరుస్తున్న కళ్లతో చూస్తోంది. గుహలో నిద్రిస్తూఉండి మేల్కొంటున్న తను పులిని చూచి ప్రాణాలు ఉగ్గబట్టుకుని మెదలకుండా అలానే ఉన్నాడు, ఎలా తప్పించుకోవటమా అని ఆలోచిస్తూ ....

కళ్లు తెరచి చూశాడు శ్రీధర్. వీధిలో ఎవరో మోటారు సైకిలు స్టార్టు చేస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటల వేళ.

ఆదివారం ఆఫీసు లేకపోవటంతో భోజనం తర్వాత పండుకున్నాడు. కునుకు పట్టింది. ఇంతలో కల. పగటి కలలో పులేమిటి ? గుహేమిటి ? కలలో తను అడవిలో నివసిస్తున్న ఆదిమానవుడు, గుహలో పడుకున్నాడు, ఇంతలో పులి వచ్చింది. కాని నిజంగా ఆదిమానవుడైనవాడు పులిని చూచి తను పొందినంత భయాన్ని పొందిఉంటాడా ? అది వాడికి మామూలు సంఘటనే అయిఉంటుంది ! ఇరవయ్యో శతాబ్దపు నాగరకునికి ఉన్నంత భయం ఆదిమానవుడికి ఎప్పుడూ ఉండి ఉండదు !

ఎదుటి గోడమీద ఉన్న కాలెండరులోని సినిమాతారే రాత్రి తనూ నాగరాజూ వెళ్లిన చిత్రంలో నాయికగా వేసింది. ఆమె ముఖంలో ఏదో ప్రత్యేకమైన ఆకర్షణ ఉంది : గుండ్రని ముఖం, పెద్ద కళ్లు, చిలిపిగా ముద్దొచ్చే చిన్న ముక్కు.... తీర్చిదిద్దినట్లున్న ఆ ముక్కు సొగసు ఎన్నిసార్లు చూచినా తనివితీరటంలేదు ! ఆమె ఎవరినో జ్ఞాపకం తెస్తూనే ఉంది రాత్రి సినిమా చూసినంతసేపూ.... పద్మమణి ! .... ఏడెనిమిదేళ్ల క్రితం హైస్కూల్లో తనతో చదువుకొన్న పద్మమణి!..

నాలుగు, ఐదు, ఆరు ఫారాల్లో మూడేళ్లూ సహాధ్యాయిని పద్మమణి. చామనచాయగా, పొట్టిగా, చలాకీగా

ఉండేది. కిలకిలా నవ్వితే నవరత్నాలలా రాలేవి .... తరగతిలో మేష్టారు ఏదైనా చమత్కరించినా, ఒక వింత విషయం చెప్పినా ఆమె నవ్వుకోసం, ఆమె హావ భావాలకోసమే తన నిరీక్ష నంతా. చదువుపై ధ్యాస చెరువునీటిలా కదలకుండా మెదల కుండా లోతుగానే ఉంటున్నా పద్మమణి నవ్వుల్తో అది తరచు తరంగిత మయ్యేది. అదే ధ్యాస, మళ్లీ పాఠాల్ని ఇంటిదగ్గర చదివేటప్పుడు, ఆయా ఘట్టాల్లో ఒక తియ్యని స్మృతినీ, సూర్యోదయ పద్మరాగ ఛాయల్ని అద్దుకొన్న నీటి దృశ్యాన్నీ, ఆహ్లాదకరంగా అనుభవానికి తెచ్చేది ! ....

ఆ రోజుల్లో తనకు ఆడపిల్లలంటే తగని సిగ్గు ....

పద్మతో ఎప్పుడూ మాట్లాడలేదు, మాట్లాడాలని ప్రయత్నం కూడా చెయ్యలేదు. మొదటి ఏడాది పద్మ ఆక ర్షణ కేవలం స్వరూపంలేని తన్మయానుభూతి .... రెండో ఏడాది నవలల్లో నుంచీ 'ప్రేమ' అనే పదం అతని పరి భాషలో ఊహలో ప్రవేశించింది. ఆ పదాన్ని స్వకీయం చేసు కోవాలనీ చేసిన ప్రథమ ప్రయత్నమే. 'నేను పద్మను ప్రేమి స్తున్నాను' అని మనస్సులో పదేపదే వల్లించుకోవటం .... అలా చెయ్యటమే మనస్సుకి ఎంతో నిండుదనాన్నీ ఉత్సాహాన్నీ యిచ్చేది ....మూడో సంవత్సరం, ఆరవ ఫారం చదువుతూ, పద్మను నిత్యమూ ఆరాధనా భావంతో చూసేవాడు. స్కూలు వదలినప్పుడు ఆమె వెనుక నడిచేవాడు. ఆమె నడక తీరు, హావభావాలు, జడవిసురు, కుచ్చెళ్ల వూపు, చీలమండలమీద పరికిణి కదలికా—ఆమెను గూర్చిన ప్రతి విషయమూ ఎంతో చక్కగా, అందంగా, ఆహ్లాదంగా ఉండేది. ఆమె ఎదురైన నప్పుడూ, ప్రక్కగా, దగ్గరగా వెళ్లినప్పుడూ, ఆమె ముక్కు సొయగమూ, కన్నుల తళుకూ తన చూపుల్నీ హృదయాన్నీ ఆకట్టేవి ! ఎప్పుడైనా ఆమె తన కళ్లల్లోకి సూటిగా చూడ టమే సంభవిస్తే చాల సిగ్గుపడి పోయేవాడు ! తనేదో దొంగ తనం చేస్తున్నట్లు, ఆమె అది గుర్తించేసి తనమీద కోపం విరక్తి తెచ్చుకుంటున్నట్లు వూహించుకుని బాధపడి పోయేవాడు. తను ఆమె నెంత నిష్కల్మషంగా, పవిత్రంగా దివ్యంగా ప్రేమి స్తున్నాడో ఆమె కెలా తెలుస్తుంది ? అని చింతించేవాడు.

ఒకసారి పరీక్ష వ్రాస్తుంటే పద్మ కలం చెడిపోయింది. ఆమె మేష్టారుతో ఆ విషయం చెప్పింది. మేష్టారు చుట్టు పక్కల ఉన్నవాళ్ల జేబులవైపు చూశాడు. శ్రీధర్ జేబులో ఒక కలం మిగులుగా ఉంది, కాని, అలా చెప్పి తీసి యిచ్చే ధైర్యం లేదు. ఇంతలో మేష్టారే చూచాడు. ఆ రెండో కలం యిమ్మని అడిగాడు. పద్మవైపు చూడనన్నా చూడకుండా హృదయం ఉద్వేగపడుతున్నా ఏదో విధి నిర్వర్తిస్తున్నట్లే కలం మేష్టారుకి అందజేశాడు ! పద్మ ఆ కలంతో వ్రాస్తోం దనీ ఆ కలం తనదని ఆమెకు తెలుసుకదా అనీ ఏదో తృప్తీ, సంతోషమూ కలిగాయి. పద్మ వ్రాయటం ముగించి లేచింది. పరీక్ష పేపరు మేష్టారి కివ్వటానికి వెళ్తూ శ్రీధర్ కూర్చున్న చోటికి వచ్చి కలాన్ని అతని కెదురుగా డెస్కుమీద పెట్టి వెళ్లి పోయింది. పద్మ కలాన్ని మేష్టారు చేతికే తిరిగి యివ్వ కుండా, తన డెస్కుమీద పెట్టి వెళ్లిందే ! అది ఆమె తన పట్ల చూపిన యిష్టమూ, విశ్వాసమూ, ప్రత్యేకతా అనిపిం చింది. తర్వాత చాల రోజుల వరకూ ఆ జ్ఞాపకం వస్తూనే ఉండేది ! .....

శ్రీధర్ నవ్వుకున్నాడు. "అప్పు డలా ఉండటం సహజమే నేమో ! వట్టి అమాయకత్వం, విపరీతమైన సిగ్గు ఆ రోజుల్లో ....అందరు కుఱ్ఱవాళ్లూ నాలా ఉండరు కూడా !" అను కుంటూ పక్కమీదనుంచి లేచాడు.

కాలెండరు దగ్గరగా వెళ్లి పద్మ మణిలా ఉన్న ఆ సినిమా తార ముఖాన్ని కొన్ని క్షణాలు పరిశీలించి చూచాడు. తర్వాత స్నానాలగది వైపు వెళ్లాడు.

నాగరాజు వాళ్ల పోస్టలు వార్షికోత్సవానికి ఆ సాయం త్రమే ఆహ్వానం ఉందన్న సంగతి చప్పున గుర్తుకు వచ్చింది. జ్ఞాపకాల్లో పడి మరిచేపోయాడు తనింతసేపూ ! గబగబ తయారవటం ప్రారంభించాడు.

రాత్రి సినిమాలో జరిగిన సంఘటన .... ఇద్దరు యువతులూ ఒక చిన్న కుఱ్ఱవాడూ వచ్చి ముందు వరుసలో కూర్చున్నారు. అందులో ఒకరికి వివాహమైనట్లు లేదు. ఆమె కాలేజీలో చదువుతున్నట్లుగా ఉంది ధోరణి చూస్తే: రెండవ ఆమె కన్న నాజూగ్గా తయారయింది. ఆ కాలేజీ అమ్మాయి తన కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చోగా, ఆమె ప్రక్కన నాగ రాజు కెదురుగా వివాహితయైన స్త్రీ, తర్వాత ఆమె కొడుకూ కూర్చున్నారు.... జడనిండా సన్నజాజులు తురుముకొన్నది కాలేజీ అమ్మాయి .... ఆ పరిమళం శ్రీధర్‌కు పిచ్చెత్తిస్తోంది... ఈ లోకానికి చెందని, వెన్నెలవంటి, పాల నురుగువంటి, ఒక స్నిగ్ధ సౌందర్యభావన ఆ సౌరభంలో కలిసి హృదయాన్ని మెలి త్రిప్పివేస్తోంది ..... ఆ అమ్మాయి ముఖం కనిపించకున్నా పరిమళం ప్రభావంవల్ల ఆమె అందాన్ని మధురంగా ఉదా త్తంగా ఊహించుకొంటున్నాడు. ఆమె జడలోని పువ్వు మీద దృష్టి కేంద్రీకరించి, పరిమళం పదునెక్కిస్తున్న భావ నైశిత్యంతో, సూక్ష్మరూపంలో ఆమె మనసులో తను ప్రవే శిస్తున్నట్లూ, ఆమె ఊహల్ని స్పృశిస్తూ ఒక క్రొత్త ప్రపం చాన్ని దర్శిస్తున్నట్లు ఒక వింత అనుభూతిలో ఉన్నాడు శ్రీధర్. ఆ అమ్మాయి ఎందుకో అంతలో లేచి నిల్చుని తను అటువైపుకు వస్తానని రెండవ ఆమెతో చెప్పి వెళ్లి పిల్ల వాడి ప్రక్కన ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చున్నది. ఇలా ఈమె అకస్మాత్తుగా తొట్రుపడుతూ వెళ్లి చటుక్కున కూర్చోవటంలో ఆమె జడలోని పువ్వుల్లోనుంచి ఒక పువ్వు రాలి క్రింద పడింది. అలా జరగటానికీ, తన దృష్టి, ఊహ ఆమెమీద కేంద్రీకృతమై ఉండటానికీ ఏదో సంబంధం వున్నట్లే తోచింది శ్రీధర్‌కు! ఇంతలో నాగరాజుకూడా ఆఅమ్మాయికి సరిగ్గా వెనుకనున్న కుర్చీలోకి మారుతూ, శ్రీధర్ని ప్రక్క కుర్చీలోనికి ఆహ్వానించాడు. తనకా మార్పు నచ్చకపోయినా వెళ్లి కూర్చోక తప్పలేదు. కూర్చుంటూ క్రిందికి చూశాడు. ఆమె జడలో నుంచి రాలిన పువ్వుకోసం. అది నాగరాజు స్థానం మార్చుకోవటంతో అతని బూటు

క్రిందపడి నలిగిపోయివుంది. తనలో ఏదో విషాదమూ, నాగరాజు మీద విసుగూ కలిగింది.

సినిమా ప్రారంభించారు. పూల పరీమళంతో బాటు కథలో లీనమయ్యాడు. ఇంటర్వెల్‌లో కాలేజి అమ్మాయి ప్రయత్నపూర్వకంగా రెండుమూడు సార్లు తలవెనక్కి త్రిప్పి చూసింది. అమెచూపులు నాగరాజు చూపుల్నికలుసుకుంటున్నాయి. తనలో కించిత్ అసూయ. నాగరాజు లీవిగా అందంగా వుంటాడు... ఆమె మళ్ళీ తిరిగి చూసినప్పుడు ఆమె సౌందర్యం ఏపాటిదో పరీక్షించి చూడటానికి వీలయింది.. ఆసౌందర్యం తనని ఆకర్షించలేదు... ఆఅమ్మాయిని గూర్చి చులకన అభిప్రాయం కూడా కలిగింది... ఆమొదటి అనుభూతి మళ్ళీ కలగలేదు!

జరిగిన సంగతేమిటో నాగరాజు తర్వాత చెప్పాడు. సినిమా జరుగుతూండగా నాగరాజు ఆ అమ్మాయి జడని మెల్లిగా కదిలించాడట. ఏమీ చలనంలేదు. తర్వాత ఆమె నడుముని తాకాడట. అప్పటికీ ఏమీ 'వ్యతిరేకమైన' కదలిక ఆమెలో కనిపించకపోవటంతో, వ్రేలితో ఆమె నడుముమీద మెల్లగా రాశాడట, చిలిపిగా, 'లవ్' అన్న ఇంగ్లీషు అక్షరాల్ని! అది ఉపోద్ఘాతం. కొంతసేపు అలానే ఉండి ఆ అమ్మాయి ముందుకు జరిగి నాగరాజుకు అందకుండా కూర్చునేదట. మళ్ళీ కొంతసేపటికి వెనక్కి వాలేదట ఆ స్పర్శకోసం! ఇలా సినిమా జరిగినంతసేపూ!

"ఛీ, పాపం, ఎందుకలా చెయ్యటం ? నిన్ను గూర్చి ఏమనుకుంటుంది ఆ అమ్మాయి ?" అన్నాడు శ్రీధర్.

"'ఏమనుకుంటుందీ! నా ప్రక్కన నువ్వూ, ఆ అమ్మాయి వెంట వాళ్ల వదినా(?) గనక లేకపోతే మా యిద్దరికీ స్నేహం కలిసేది! స్పర్శలో ఉండే మహత్వం నీ కేం తెలుసోయ్! పెళ్లయిన వాళ్ళకి శరీరంలో స్పర్శనైశిత్యం మొద్దుబారిపోతుంది. నాబోటివాడికి దేహంలో ప్రతి అంగుళంలోనూ స్పర్శసౌఖ్యం అనుభూత మౌతుంది. దాన్ని అలా నిలుపుకోవటమే ఒక తపస్సు! నా కేమిటి, పెళ్లికాని ఆ అమ్మాయికీ అంతే! ఈ సున్నితమైన అనుభవాలు నీకేం అర్ధవౌతాయిలే!' అన్నాడు నాగరాజు.

శ్రీధర్‌కు కోపం వచ్చింది. ఏది సున్నితం, ఏది మొరటు? ఆమె జడలోని పూల పరీమళాన్ని తనెలా మానసికంగా ఆనందించగలిగాడో, అప్పు డొక పువ్వు రాలి పడటంతో విశేష మేమిటో, దాని విషాదాంత మేమిటో కవిత్వంగా వర్ణించి చెప్పారు. దానికి నాగరాజు జవాబు: "నీది భావ కవిత్వం. నైతికంగా నువ్వు చేసిందీ నేను చేసిందీ ఒక్కటే కద! కాకపోతే నీకు భయం! జీవితంపట్ల నాకు ఆ సందేహమూ భయమూ లేవు! అనుభవాన్ని మించి విలువైన దేదీ నాకు కనిపించదు ...."

బస్సు రావటంతో తర్వాత వాదించటానికి అవకాశం లేకపోయింది. "రేపు మా సెంట్ థామస్ హాల్ వార్షికోత్సవం, నీకోసం గెస్టు టికెట్ తీసి అట్టే పెట్టాను, తప్పకుండా రా! అప్పుడే గుమాస్తా జీవితానికి అలవాటు పడిపోతున్నావ్? నీకు క్రొత్త స్నేహితుల్ని పరిచయం చేస్తాను రా!" అంటూ బస్సెక్కి వెళ్లిపోయాడు నాగరాజు.

* * *

నాగరాజు శ్రీధర్‌కు లయోలా కాలేజీలో రెండేళ్లు సహాధ్యాయి. డిగ్రీ పుచ్చుకున్న తర్వాత శ్రీధర్ పెళ్లిచేసుకుని ఉద్యోగ ప్రయత్నంలో పడ్డాడు. నాగరాజు తాంబరం క్రిస్టియన్ కాలేజిలో ఎం. ఏ. లో చేరాడు. ఇద్దరికీ చాలా అన్యోన్యం, ఆత్మీయతా. ఒకరి కొకరు చెప్పుకొనని ఊహలంటూ, రహస్యాలంటూ, చర్చించని సిద్ధాంతాలంటూ లేవు. శ్రీధర్ చదువు చాలించి, పెళ్లి—ఉద్యోగం వంటి బాధ్యతల్ని అప్పుడే మీద వేసుకోవటం నాగరాజుకు నచ్చలేదు. మామగారి దగ్గర ధన సాహాయ్యం పొంది, శ్రీధర్ ఎం. ఎస్‌సి లో చేరిఉండవలెనని నాగరాజు అభిప్రాయం. శ్రీధర్‌కు ఆత్మాభిమానం అడ్డు వచ్చింది. తండ్రి పైకి చదివించలేనని స్పష్టం చేశాడు. ఇక తన బరువు తను మోయటమే ధర్మ మనిపించింది శ్రీధర్‌కు. ఇదంతా శ్రీధర్ అమాయకత్వం, చేతకానితనం అంటాడు నాగరాజు.

* * *

శ్రీధర్ బస్సులో త్యాగరాయనగరం వెళ్లి ఎలక్ట్రిక్ ట్రెయినుమీద తాంబరం చేరుకునేటప్పటికి కొంత ఆలస్యమే అయింది. అప్పటికే అతిధు లందరూ వచ్చేశారు, పార్టీలో కూర్చుంటున్నారు. ఒక వలంటీరు శ్రీధర్‌కు నాగరాజు ఎక్కడున్నాడో చూపించాడు. బూడిదరంగు ట్వీడ్ సూట్‌లో అందంగా చెక్కిన విగ్రహంలా ఉన్న నాగరాజు ఇద్దరు యువతుల మధ్య అప్పుడే టీ టేబుల్ దగ్గర కూర్చోబోతూ ఉన్నాడు. శ్రీధర్‌ని గుర్తించి నవ్వుతూ చేయి పైకెత్తాడు రమ్మని. పెళ్లిలో అత్తవారు చదివించిన ముదురు నీలంరంగు ఫాంటు, తెల్ల సిల్కు బుష్‌షర్టు వేసుకున్నాడు శ్రీధర్. పూర్తి సూట్ వేసుకుని ఉంటే బావుండేదేమో అనిపించింది. నాగరాజును చూడగానే మళ్ళీ ఫరవాలేదు లెమ్మని సరిపుచ్చుకున్నాడు.

నాగరాజు శ్రీధర్‌ని ఆ యిద్దరి యువతుల మధ్య కూర్చోబెట్టుతూ వాళ్లని పరిచయం చేశాడు: మాయలతా రామస్వామి, సిసీలియాపాల్ అంటూ. తర్వాత తను సిసీలియా ప్రక్కన కూర్చున్నాడు నాగరాజు. ఆ టేబిల్ దగ్గరే మరో ముగ్గురు—యిద్దరు యువకులూ ఒక యువతీ కూర్చున్నారు. కాని, వాళ్ల జట్టు వేరు, వీళ్ల జట్టు వేరు. అదీ పద్ధతి. శ్రీధర్‌కు కొంచెం క్రొత్తగా ఉంది. లయోలాలో హాస్టలు డేకి ఆడవాళ్లని అతిథులుగా పిలవటానికే వీల్లేదు. అదీకాక అక్కడ యిక్కడివలె ఇద్దరు హాస్టలు మెంబర్సు చొప్పున వాళ్లకి వాళ్ల అతిథులకి మాత్రమే ప్రత్యేకంగా టేబిల్ ఏర్పాటు చెయ్యటమూలేదు. అందర్నీ ఒకే పొడుగునా బంతి భోజనాలకు కూర్చోబెట్టేవారు.

మాయలత శ్రీధర్‌ని పలకరించి, కలుగజేసుకుని మాట్లాడడం ప్రారంభించింది. సిసీలియా ఒకటి రెండు పాడి

మాటలు తప్ప శ్రీధర్‌తో మాట్లాడలేదు. ఆమె అటువైపు తిరిగి నాగరాజుతోనే మాట్లాడుతూ ఉంది. అతని కళ్లల్లోకి గుచ్చి చూస్తూ, ఒకసారి ఆప్యాయంగా గోముగా, ఒకసారి మంద లిస్తున్నట్లు, ఒకసారి సున్నితంగా వెక్కిరిస్తున్నట్లు మాట్లాడు తోంది. ఆమె మాటల్లో వింత విషయాలేమీ లేకపోయినా నాగరాజుతో ఆమె ధోరణి విచిత్రంగానే తోచింది శ్రీధర్‌కు. అందుకు భిన్నంగా మాయలతలో వ్యక్తమౌతున్న నమ్రత, మార్దవం, సిగ్గు శ్రీధర్‌ని బాగా ఆకర్షించాయి. ఆమె విరజిమ్ము తున్న మొగలి అత్తరు వాసన, ఆమె వ్యక్తిత్వానికే ఒక విశిష్ట మధుర గుణాన్ని ఆపాదిస్తోంది.

పరిచయంచేస్తూ నాగరాజు గడుసుగా అబద్ధ మాడే శాడు : "ఇతను శ్రీధర్, ప్రెసిడెన్సీ కాలేజీలో ఎం. ఎస్‌సి ఫైనల్ చదువుతున్నాడు." అన్నాడు. ఎందుకలా అన్నాడో శ్రీధర్‌కు వెంటనే అర్థంకాలేదు. తర్వాత కారణం సులువు గానే ఊహించుకున్నాడు. గుమాస్తాగా పరిచయం చేస్తే ఆ యువతుల ముందు ఇద్దరికీ గౌరవలోపమే అవుతుంది కాబోలు ! కొంతసేపటికి మాయలత అడిగింది : "మీరు మదనపల్లిలో పెద్ద భూస్వాములట కదూ ! నాగరాజు చెప్పాడు.... "శ్రీధర్‌కు చిక్కుగా ఉంది. తను ఇంకా రంగంలో ప్రవే శించకముందే తనను గూర్చి నాగరాజు ఏవేవో గొప్పలు చెప్పే శాడు ! తనకి అబద్ధా లాడటం, గొప్పలు పోవటమంటే బొత్తిగా నచ్చదు. కాని, యీ పరిస్థితిలో ఏదో చెప్పక తప్పదు. తన కుటుంబానికి భూమి వ్యవసాయం ఉండటం నిజమే కాబట్టి : "ఏదో ఉందిలెండి" అన్నాడు. "మీరు గొప్పలు చెప్పరనీ, మాడెస్ట్ అని కూడా అన్నారులెండి" అన్నది మాయ లత నవ్వుతూ, శ్రీధర్ జవాబును ఇంకోవిధంగా అన్వ యిస్తూ. ఆమెతోపాటు తనూ నవ్వాడు చేసేదిలేక.

"మా పెత్తండ్రిగారు మీ మదనపల్లి శానిటోరియంలో డాక్టరు. నేను రెండేళ్ల క్రితం ఒకసారి వచ్చాను. మదనపల్లి చక్కని ఊరు. ఆరోగ్యవరం ఎంతో హాయిగా ఉంటుంది!" అన్నది మాయలత. "నిజమే" అని ముక్తసరిగా అంగీక రించాడు శ్రీధర్.

"నా చదువు పూర్తికాగానే ఆరోగ్యవరంలో ఒక ఏడాది స్పెషల్ ట్రెయినింగ్ కోసం గడపాలని యిప్పటినుంచే ప్లాను!" అన్నది మాయలత.

ప్రశ్నలమీద ప్రశ్నలూ, జవాబులూ, నాటకంచూస్తూ చనువుగా వ్యాఖ్యానాలూ నవ్వులూ దొర్లాయి. డిన్నరు వేళకు మాయలత శ్రీధర్‌ను వ్యక్తిగతమైన వివరాలు, అతని జీవిత భవిష్యత్తును గూర్చి ప్రశ్నించేదాక వచ్చింది. జవాబు నివ్వటం ఒక్కోసారి యిబ్బందిగానే ఉన్నా ఆమెతో పరిచయం శ్రీధర్‌ను మధురంగా, హాయిగా, ఏ నాగలోకపు మొగలి తోటల్లోనో విహరిస్తున్నట్లుగా మైమరపిస్తోంది ....

"మీరు ఎం. ఎస్.సి. తర్వాత ఏం చేస్తారు ?" అన్న ప్రశ్నకు శ్రీధర్ ఎక్కువగా తడుముకోలేదు. "ఏదైనా పరి శ్రమలోనో, కంపెనీలోనో చేరటమో, లేకపోతే ఫారీన్ వెళ్లా లనో అనుకుంటున్నాను." అన్నాడు. అలా అనటానికి అత్తవారు తన్నుగూర్చి కట్టిఉంచిన గాలిమేడలు సమయానికి తడుముకో కుండా బాగా సహాయపడ్డాయి. మాయలతకు ఆ జవాబు ఎంతో నచ్చింది. కళ్ళు పెద్దవిచేసి, ఉత్సాహంగా "నాకూ ఫారీన్ వెళ్లాలని ఎంతో ఉంది !" అన్నది.

డిన్నరు పూర్తి అయ్యేటప్పటికి ఎనిమిదిన్నర అయింది. సిసీలియా మాయలతలు వెంటనే వెళ్లిపోవా లన్నారు. నలు గురూ స్టేషన్ చేరుకున్నారు. అప్పుడే ఒక ట్రెయిన్ వెళ్ల టంతో, ఇంకా ముప్పావుగంట ఆలశ్యం ఉందని తేలింది. నలు గురూ ప్లాట్‌ఫారమ్ చివరిదాకా నడిచి, వెలుతురు పడకుండా మసగ్గా ఉన్నచోట నిల్చున్నారు.

"మీరూ మాతో టౌన్‌కి వస్తారుకదా !" అన్నది మాయ లత శ్రీధర్ నుద్దేశించి.

"లేదు, ఈపూట యిక్కడే ఉంటాడు" అన్నాడు నాగరాజు.

మాయలత శ్రీధర్‌వైపు వంగి అతని ముఖంలో ముఖంపెట్టి "మీ రిద్దరూ అంత ఎడబాయలేని మిత్రు లేమిటి ?" అన్నది.

శ్రీధర్ ఏమీ మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వాడు.

"నువ్వు తీసుకువెడితే నా కభ్యంతరం ఉండదులే" అన్నాడు నాగరాజు మాయలత నుద్దేశించి.

అంతవరకు ఏమీ మాట్లాడకుండా మౌనం వహించి కొంత ఎడంగా నిల్చునిఉన్న సిసీలియా చప్పున "రా !" అని పిలిచింది. "వచ్చే శనివారం ఆ విషయం ఏమైందీ నాకెలా తెలుస్తుంది ?" అన్నది అతనితో వాళ్లిద్దరికే ప్రత్యేకమైన సంగతిని దేన్నో గుర్తుకుతెస్తూ ....

నాగరాజు రాగయుక్తంగా చిలిపిగా "నేను వస్తానుగా" అన్నాడు.

సిసీలియా నాలు గడుగులు ముందుకు కదిలింది అతనితో ప్రత్యేకంగా ఏదో మాట్లాడాలని సూచిస్తూ. నాగరాజు ఆమెతో వెళ్లాడు.

మాయలత శ్రీధర్ పక్కనే దగ్గరగా నిల్చుని ఉంది.

"మా హాస్టలుకి ఎప్పుడైనా రండి" అన్నదామె మెల్లగా.

ఇంతలో కరెంటు పోయి సర్వం గాడాంధకారం అయింది.

"ప్లీజ్ శ్రీ ! చీకటి అంటే నా కేదో చెప్పరాని భయం !" అన్నది మాయలత శ్రీధర్‌ని వ్రేలితో తాకుతూ.

"నా చేయి పట్టుకోండి" అన్నాడు శ్రీధర్ కుడిచేయి ఆమె కందిస్తూ.

"థాంక్స్."

రెండు నిముషాల తర్వాత దీపాలు వెలిగాయి. శ్రీధర్ మాయలతలు అక్కడే నిల్చుని ఉన్నారు. వాళ్లకు నాగరాజా సిసీలియాలు కన్పించలేదు.

"వాళ్ళు చీకట్లోనే వెయిటింగ్‌రూముకి చేరుకున్నారు కాబోలు" అన్నది మాయలత.

శ్రీధర్ ఆమెతో వెయిటింగ్‌రూము వైపు నడిచాడు. నాగరాజు, సిసీలియాలు అక్కడ లేరు. శ్రీధర్ మాయలతలు చెరొక కుర్చీలో కూర్చున్నారు. ఫంక్షనుకు వచ్చిన అతిథుల చాలమంది అప్పుడే స్టేషను చేర్తుకుంటున్నారు. ఇంతలో రైలు వచ్చి ఆగింది. శ్రీధర్ మాయలతా వెయిటింగ్‌రూమ్ బయటికి వచ్చి చూశారు. నాగరాజ్ సిసీలియా ప్లాట్‌ఫారమ్ అవతలి కొసనుంచీ వస్తూ ఉన్నారు.

సిసీలియా ముఖం గంభీరంగా ఉంది. ఆమెకు కోపం వచ్చినట్లుంది. నాగరాజు కూడా మామూలుగా నవ్వుతూ లేడు. ఆలోచిస్తూ బరువుగా పరధ్యానంగా ఉన్నాడు.

మాయలతా, సిసీలియా రైల్లో ఎక్కి కూర్చున్నారు. తర్వాత ఎవరూ మాట్లాడలేదు. విజిల్ యిచ్చారు. నాగరాజు ఏదో మాట్లాడబోయారు.

“నాకు తల నొప్పిగా ఉంది రాజ్ .... శ్రమ తీసుకున్నారు ... థాంక్స్” అన్నది సిసీలియా.

“థాంక్స్ .... థాంక్స్” అన్నది యిద్దరితోనూ మాయలత చివరిచూపు శ్రీధర్‌మీద నిలిపి రైలు కదులుతూండగా....

“అబ్బ ! ఈ ఆడవాళ్ల గొడవ యిప్పటికి తీరింది !” అన్నాడు నాగరాజు దీర్ఘ నిశ్వాసంతో ఓవర్‌బ్రిడ్జి మెట్లెక్కుతూ.

“గొడవేమిటీ ? సాయంత్రం చాలా సరదాగా గడిచింది. అంతా అయిన తర్వాత ఊరికే అలా అనటం అదో పోజు కాబోలు” అన్నాడు శ్రీధర్.

నాగరాజు ఏమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచనలో పడిపోయాడు. శ్రీధర్ మనస్సు మాయలతతో సాయంత్రం జరిగిన సంభాషణని తరంగాలుగా రాగాలాపన చేస్తూవుంది. ఇద్దరూ మౌనంగానే హాస్టలు చేరుకున్నారు.

సూటువిప్పి దోవతి తీసి లుంగీగా ధరిస్తూ, శ్రీధర్‌కు కూడా ఒక చాకింటి దోవతి యిచ్చాడు నాగరాజు. బాత్‌రూమ్‌కి వెళ్లి ముఖాలు కడుక్కున్నారు. “అలా గాలిలో తిరిగి వద్దాంరా” అన్నాడు నాగరాజు.

వెళ్లి కాలేజి భవనాల ముందున్న విశాలమైన మెత్తని పచ్చికమీద ఒకచోట కూర్చున్నారు.

“నన్నివాళ పెద్ద అబద్ధాలకోరును చేశావు. చదువు, ఆస్తి, పెళ్లి అన్ని విషయాల్లోనూ ఒక వేషం వెయ్యాల్సి వచ్చింది. అది నాకేం నచ్చలేదు.” అన్నాడు శ్రీధర్.

“ఏమిటి నీ మొహం నీకు నచ్చేది !” ఆప్యాయంగా నవ్వుతూ, మందలిస్తూ అన్నాడు నాగరాజు. “నీకు జీవితం అంటే ఏమిటో తెలీదు ! ఆ అమ్మాయితో సరదాగా కబుర్లాడుతూ ఒక సాయంకాలం గడిపావా, లేదా ? అంతకంటే నీవు బావుకునే దేమిటోయ్ నీ సత్యసంధతతో ! రేపటి విషయం అంటావా, నీ కిష్టంలేకపోతే ఇక నువ్వామెను ఎప్పుడూ కలుసుకోనక్కరలేదు ! ఈ సాయంత్రం యిలా మధురంగా గడిపావ్, చాలు, యీ జ్ఞాపకాన్ని దాచుకో !”

“బాగుంది నీ వేదాంతం ! అయితే సత్యానికి విలువ లేదంటావ్ .... అదలా ఉంచు కాని, ఎవరు వీళ్లు ? ఈ అమ్మాయిలను గూర్చి నా కెప్పుడూ చెప్పనేలేదే !”

“పోయిన సంవత్సరం ఒకసారి సినిమాలో యీ సిసీలియాతో స్నేహం కలిపాను. ఆమెకు ఇంటరులో క్లాస్‌మేట్ యీ మాయలత. మెడిసిన్ నాలుగోయేడు చదువుతోంది. సిసీలియా బి. ఏ. ఒక పార్టు మాత్రం పాసయి ప్రస్తుతం యింట్లో ఉంటోంది. ఒక్కర్తే కూతురు. తండ్రి బాగా డబ్బున్న ఇంజనీరు. మాయలత సిసీలియాతో ‘బాయ్ ఫ్రెండ్’ కావాలన్నదట. వాళ్ల ‘మెడికోస్’ అంటే ఆమెకు నచ్చరట. సరే పరిచయం చేస్తాను తీసుకురా అని నిన్ను ఆమెకు అప్పగించాను. ఇక నీ యిష్టం !”

“ఆమె నా వివరాలన్నీ గుచ్చి గుచ్చి అడుగుతోంది !”

“ఇంకేం ? తొలిచూపులోనే వలపు ! నచ్చావన్నమాట.”

“కరెంటు పోయినప్పుడు చీకట్లో భయం వేస్తోందని నా చేయి పుచ్చుకొన్నది.

“నువ్వేం జేశావ్ ?”

“ఏం జేస్తాను ? .... నాకు వివాహమైపోయిందిగా ?”

“అయితే ఏం ?”

“అంటే నీ ఉద్దేశ్యం ఏమిటి ? నువ్వు నిజంగానే చాలా చెడిపోయినట్లున్నావు ఒక ఏడాదిలో ! .... రాత్రి సినిమాలో అలా చేశావు. ఇప్పుడు నీ ధోరణి యిలా ఉంది ! నాకు ఒకవేళ వివాహం కాకపోయినా ఆ అమ్మాయి నమ్మి చెయ్యి పుచ్చుకున్నప్పుడు నా ధర్మం నాకు తెలీదా ?”

“ఏమిటోయ్ ధర్మమంటే, చెడిపోవటమంటే, ఆలోచించు ! నువ్వు దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంటావనే ఆ అమ్మాయి అలా చేసిందనుకో, ఆమెకు ఆశాభంగం కలిగించటం నీ ధర్మమా ? .... అయినా నీతో వాదించటానికి నా కిప్పుడు ఓపికలేదు గాని, అదీ సంగతి ! నీ కిష్టంలేకపోతే ఆమెను శుభ్రంగా మరచిపోయి హాయిగా ఉండు. బలవంతంలేదు ! నీ ధర్మాన్ని విడిచిపెట్టమని నేను చెప్పటంలేదు!”

“అయితే నీకు ఆ సిరియన్ క్రిస్టియన్ అమ్మాయిని వివాహం చేసుకోవాలనే లేదా ? ఆమెను ప్రేమించావుగా !”

“ప్రేమ .... ప్రేమ .... మళ్లీ ఇంకో భావకవిత్వం తాలూకు పదం వాడుతున్నావు, నిర్వచనం లేకుండా ! చిలుక పలుకుల్లా అప్పగించేస్తున్నావు ! పోనీ ప్రేమే అనుకో, పెళ్లి చేసుకోవాలని ఎక్కడుందీ ?”

“అయితే నీ ఉద్దేశం ఏమిటి ? ఆ అమ్మాయిని మోసం చేద్దామనే ! ఛీ, అలా చెయ్యబోకు ! ఆ అమ్మాయికి నువ్వంటే ఎంతో మమకారం ఉంది. నేను చూస్తూనే ఉన్నానుగా, నిన్ను నిజంగానే ప్రేమిస్తోంది !”

“నీకు బుద్ధి విస్తృతం కావటంలేదు ! .... ఊత పదాల్ని, ఊకదంపుడు భావాల్ని పట్టుకుని వదలనంటున్నావు, నేనేం జేసేది ? ఆమెను నాలో ఆకర్షిస్తున్న దేమిటి ? సరదా, ఆనందం. సరే, నాకూ అదే కావాలి అనుకుందాం. ఈ పరస్పరం

వాంఛిస్తున్న దానిని నువ్వు 'ప్రేమ' అంటావనుకో. పెళ్లి చేసుకున్న తర్వాత అది ఎలానూ నిలవదు. అప్పుడు ఇద్దరి గతీ ఏమౌతుంది ? అందువలన యిప్పటి యీ స్నేహానికి అంతకంటే విలువ లేదు, యివ్వరాదు, అని నా అభిప్రాయం.... నా మనస్సు బాగులేదు, ఇప్పు డింతకంటే చెప్పను."

"అయితే నువ్వు పెళ్లే చేసుకోవా ? నీకు పెళ్లిలో నమ్మకం లేదా ?"

"ఏమో, రేపటి సంగతి ఆలోచించటం నా కిష్టం లేదు ! పోదాం పద, పడుకుందాం" అన్నాడు నాగరాజు.

దీపం తీసివేసిన తర్వాత చాలసేపు ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. ప్రేమించి పెళ్లిచేసుకోవాలని శ్రీధర్ ఎన్నడూ ఆశయంగా పెట్టుకోలేదు. అందుకే పెళ్లి సంబంధం రాగానే, అమ్మాయి, నచ్చగానే తండ్రి అనుమతితో పెండ్లి చేసుకున్నాడు. కాని, ప్రేమ అనేది సంభవించినా నాజరాజు పెళ్లి విషయమై సందేహిస్తూ ఉండటమేమిటో అతనికి అర్థం కాలేదు ! మాయలత లాంటి మెడిసిన్ చదువుతున్న అందమైన యువతి తనను కోరితే, అవివాహితుడై ఉంటే తను కాదనే వాడేనా ? "చీకట్లో నాకు భయం వేస్తుంది" అని మృదువుగా మధురంగా ఆమె కోరటమూ, తను చేతిని అందివ్వటమూ, అది జీవితానికే అందమైన అర్థాన్ని ఆపాదించే సంఘటనలా ఉంది ! అది వివాహానికే వ్యాఖ్యానం—జీవితమనే చీకటిదారిలో ఆడది మగవాడి చేయి పట్టుకుని నడవటమే కదా వివాహం !

"రాజా, మాయలత కులమేమిటి?"

"ఇండియన్ క్రిస్టియన్."

"మరి ఆ పేర్లేమిటి ?"

"అవును, వాళ్ల తాతగారు మతం మారారు."

మతాంతర వివాహ మైతేనేం, అదీ ఒక గొప్ప ఆదర్శాన్ని సాధించటమే కదా అన్పించింది శ్రీధర్‌కు.

"నాకు వివాహం కాలేదనుకో, నాకు మాయలతను మతాంతర వివాహం చేసుకునే అవకాశం ఉండేదంటావా ?"

"నీ ప్రశ్నలూ, నువ్వూ ! .... వట్టి అమాయకుడివోయ్ ! నీకు నిజంగానే నేను చెప్పినంతా, ఆమె ఊహించినంతా జమీందారీ డబ్బూ ఉన్నట్లయితే మతమూ అడ్డురాదు, ప్రేమా అవసరంలేదు ! తప్పకుండా ఆ అవకాశం ఉండేది. కాని, శ్రీధర్, చూడు, ఈ ఆడపిల్లలకి కావలసిం దొక్కటే, అది సరదా ! అది కూడా పరిస్థితుల్నిబట్టి రెండు రకాలుగా ఉంటుంది. సిసీలియాకు డబ్బుకొరత లేదు. అందువల్ల ఆమెకు జీవితంలో కావలసిన సరదా, సుఖం, నాలాంటి చలాకీగా ఉండే వ్యక్తియొక్క స్నేహం. మాయలతకు డబ్బులేదు. కాబట్టి ఆమె ముఖ్యంగా కోరుకొనేది డబ్బు యివ్వగలిగిన సరదాలు. ఫారీన్ వెళ్లటం, కారులో తిరగటం, ఊటీ, కాశ్మీర్ వెళ్లటం లాంటివి .... చూశావా, వాళ్లిద్దరిమధ్యా బేదం ! అదీ సంగతి .... నువ్వు మళ్లీ మాయలత ముఖం చూడదలుచుకుంటే వెళ్ళేప్పుడు ఒక పచ్చ నోటు జేబులో పెట్టుకుని వెళ్లు. ఏదైనా ప్రెజెంట్ యివ్వు, టాక్సీలో త్రిప్పు, నువ్వు చెప్పినట్లు వింటుంది ! అమాయకంగా చేతులూపుకుంటూ వెళ్లి 'నేను అప్పుడు అబద్ధాలు చెప్పాను, నేను సత్యసంధుణ్ణి, నిన్ను జీవితాంతం ప్రేమిస్తాను' అని ప్రారంభిస్తే మాత్రం తలుపుతీసి రోడ్డు చూపిస్తుంది ! జీవితమ్మోయ్, యిది జీవితం ! నీ ఆదర్శాల కోసం జీవితం ఆగటంలేదు. అవి పుస్తకాల్లో ఉన్నాయి; ప్రస్తుత జీవితంలో లేవు !"

"అయితే ఈమధ్య నువ్వు చేస్తున్న వాదం మాటవరసకి మాత్రమే కాదు. ఇదంతా జీవన సిద్ధాంతంగానే తయారుచేసుకుంటున్నా వన్నమాట ! ఏమిటి నీ లక్ష్యం? ప్రేమ, సత్యం, ఆదర్శాలూ లేకపోతే జీవితంలో మిగిలే దేమిటి రాజా ? క్షణికమైన ప్రయోజనాల కోసం అనంతమైన శాశ్వతమైన విలువల్ని బలిపెట్టటమేనా ?"

"నిజంగానే మిగిలే దేమీ లేదు, కాని అప్పుడే సర్వమూ మిగులుతుంది, అంటే నీ కర్థమౌతుందా ?.... నువ్వు పలికేవి చిలకపలుకులు .... నా కిప్పుడు ఓపికలేదు, ప్రొద్దున చెబుతాను—కాని జ్ఞాపకం పెట్టుకోవలసింది ఒక్కటే శ్రీధర్ ! జీవితం !! జీవితం దిగితే గాని లోతు తెలీని ప్రవాహం. నువ్వు పెళ్లి చేసుకోవటంతో కేవలం పాతబాట పట్టుకొని వెళ్లిపోతున్నావు. నేను క్రొత్తమార్గం అన్వేషిస్తున్నాను. అంతే.... ఆలోచించుకో !"

"నాకు నమ్మకంలేదు క్రొత్తమార్గాలంటూ ఉన్నాయని. ....మనుష్యులు వ్యామోహంలో పడిపోతూ ఏదో క్రొత్త సంగతి కనిపెట్టుతా మనుకుంటారు, చెడిపోతారు...."

"నీ మొహం ! అది ఆత్మవిశ్వాసం లేనివాళ్ల సంగతి .... ఇక పడుకో నాకు నిద్రవస్తోంది ...."

శ్రీధర్ కూడా వాదించ దలచుకోలేదు.... నాగరాజులో ఏదో పెద్ద మార్పే వస్తోంది !.... అయితే మాయలత తన్ను ధనికుణ్ణనుకుని తనమీద ఆసక్తి కనబరుస్తోందా ? .... ఏమైనా తను వివాహితుడు, యిక ఆమెను గూర్చి ఆలోచించి ఏం చేయాలి ? .... తనకు ప్రేమద్వారం శాశ్వతంగా మూయబడింది ! .... తను తారను ప్రేమించటంలేదూ ? ప్రేమించకపోతే ఎందుకు పెళ్లి చేసుకున్నాడు ? ప్రేమిస్తూనే ఉన్నాడు, కాని తార తనని అర్థం చేసుకోవటమే లేదు ! దాని క్కారణం ఆమె తల్లిదండ్రులు ! అర్థంచేసుకోవటానికి ఆమె ప్రయత్నమైనా చెయ్యనక్కరలేకుండా, వివాహ వ్యవస్థ ఒక్కసారిగా ఆమెకు తనమీద ప్రసాదించిన హక్కులే మరొక కారణం !... ప్రేమద్వారం ముందు నిల్చుని తలుపు తట్టుతూ తను యిలా ఎంతకాలం నిరీక్షించాలో !

## 4

అద్దము నేలమీద పడి ముక్కలైపోయింది. చేతినుండి అది ఎలా జారిపోయిందో శ్రీధర్‌కు అర్థంకాలేదు. మామూలు జాగ్రత్తతోనే తీశాడు. తల దువ్వుకున్నాడు, మళ్లీ యథాస్థానంలో పెట్టబోయేంతలో జారి పడిపోయింది. అద్దం పగిలిపోవటం మంచి శకునం కాదంటారు !

ఆఫీసుకు వేళకు సరిగానే చేరుకున్నాడు గాని శ్రీధర్ మనసు మనసులో లేదు. ప్రొద్దున తాంబరం నుంచి వస్తూ

వస్తూ నాగరాజుతో పెద్ద వాదన పెంచుకున్నాడు, గతరాత్రి మాట్లాడిన విషయాలమీద.

"అబద్ధం ఏ పరిస్థితిలోనైనా సరే చెప్పకపోవటం, నిత్య వ్యవహారంలో నిజాయితీ, స్త్రీ, పురుష సంబంధాల్లో ఉదాత్తత పవిత్రత—యివి జీవితానికి చాల ముఖ్యం" తన విశ్వాసాన్ని నొక్కి చెప్పాడు శ్రీధర్. నాగరాజు సమాధానం డొంక తిరుగుడుగా ఉంది.

"నిజమే, ఇవన్నీ మంచి విలువలే, కాని జీవితం అన్నింటికన్నా ముఖ్యం. జీవితాన్ని యీ విలువల్నించి విడదీసి చూడటం నేర్చుకో! ఏమంటే, జీవితానికీ నువ్వు చెప్పే విలువలకీ అవినాభావ సంబంధంలేదు. జీవితం వాటిమీద ఆధారపడవచ్చును. ఆధారపడకుండా ఉండవచ్చును కూడా! జీవితమే పరమోత్కృష్టమైనది కావటంతో నైతికమైన విలువల కోసం వ్యక్తి తన జీవితాన్ని శుష్కింపజేయటం, లేక అనుభవాన్ని నిరాకరించటం ఆత్మహత్య" అంటాడు నాగరాజు.

ఇలా జీవితాన్నీ 'విలువల్నీ' వేరుచేసి కుస్తీ పట్టటం తనకు నచ్చలేదు. "గాంధీగారి జీవితాన్ని గూర్చి నీ అభిప్రాయమేమిటి ?" అని ప్రశ్నించాడు తను.

"అవును, గాంధీగారిలోనూ జీవితమే ప్రాముఖ్యం వహించింది! లేకపోతే ఆయన ఇంత విప్లవాన్ని ఎలా సాధించగలిగాడు! ఆయన విషయంలో జీవితం నైతికమైన విలువల క్రింద నలిగిపోకుండా వాటి ద్వారానే రూపొందటం జరిగింది. అది ఆయన సాధించిన విశిష్టత. అంతే! ఆ అదృష్టం, అలాంటి వ్యక్తిత్వం ఎందరికి ఉంటుంది ? లక్షమందిలో, కోటి మందిలో ఒక్క గాంధీ అయినా కనిపించకపోవటానికి కారణమేమిటి ? .... అందరిలోనూ జరిగేది; కొన్ని నైతిక సూత్రాలకు, ఆదర్శాలకు జీవితాన్ని బలిపెట్టడం: దానివల్ల ఏమిటో సాధింపబడుతోందనుకోవటం: చివరకు వ్యర్థజీవులు కావటం. అలా కావటమే నా కిష్టంలేదు! జీవితానికే ప్రాముఖ్యం ఇస్తూ అవసరమైన విధంగా నా నైతికాదర్శాన్ని రూపొందించుకోవటమే నా పద్ధతి..... గాంధీ మాత్రం ఏంచేశాడు ? క్రొత్త విలువల్ని రూపొందించలేదా ?"

"జీవితం అంటే ఏమిటి ? నువ్వు వాడుతున్న అర్థంలో ఆ పదం నాకు బోధపడటంలేదు."

"కేవలం అనుభూతి—సుఖమో, దుఃఖమో, ఆనందమో, విషాదమో–మంచీ, చెడూ ప్రమేయంలేని స్వచ్ఛందమైన అనుభూతి, అది ఒక్కటే పరమోత్కృష్ట మైనది. దాన్ని పొందటమే జీవితం అంటాను."

"ఉదాహరణకు."

"ఉదాహరణా ? ఏముందీ! నిన్న నువ్వు మాయలత సన్నిధిలో మధురంగా గడిపిన క్షణాలు నీకు కలిగించిన అనుభూతి ఏమిటి ? కేవలం ఒక ఆనందం. అదే జీవిత ధర్మం. దాన్ని గుర్తించి, దానికి విలువ యివ్వు! నువ్వు నిన్ను గూర్చిన వివరాలు ఆమెకు సరిగా చెప్పావో లేదో అనేది అప్రస్తుతం, దానికి ప్రాధాన్యం లేదు....."

"ఏడ్చినట్లుంది! ఇలా అయితే మనుష్యులు ఒకరినొకరు నమ్మటం ఎట్లా ? లోక వ్యవహారం జరగటం ఎట్లా?"

"ఎందుకు నమ్మరు ? లోక వ్యవహారం ఎందుకు జరగటంలేదు ? నమ్మేవాడు అబద్ధం చెప్పినా నమ్ముతాడు, నమ్మకము లేనివాడు నిజం చెప్పినా నమ్మడు. ఏ సమయంలో ఏది పనిచేస్తుందో, ఏది అవసరమో దాన్ని ఉపయోగించటమే జీవితలక్షణం .... జీవితం నిజాయితీమీదే జరగటంలేదే! నిజాయితీ తక్కువై ఆగిపోవటంలేదే!"

"నువ్వు తమాషాకు వాదిస్తున్నావేమో నాకు తెలీటంలేదు కాని, ఇంత అవకాశవాదివై పోయావు, ఎప్పటినుంచీ రాజా ? నా కాశ్చర్యం వేస్తోంది!"

"అవకాశవాది అన్న పదం చక్కనిది! అవును, అలా కావటమే జీవించటం అంటే! మన రాజకీయాలు చూడు ఉదాహరణకి! జీవితస్వరూపం తెలీనివాళ్ళు కొన్ని విలువలే దాని స్వరూపం అనుకొని భ్రమపడతారు. ఆ రూపాన్నే అంటిపెట్టుకుంటారు. అంతలో జీవితం ఆ విలువల్ని దాటి, వాళ్ళని వదలిపెట్టి ముందుకు కదలిపోతుంది. జీవితం విలువల్ని సృష్టిస్తుంది కాని విలువలు జీవితాన్ని సృష్టించవు అనే సత్యం వాళ్ళకు తెలీదు. గాంధీగారు చేసిన పనేమిటి ? ఆయన క్రొత్త విలువల్ని సృష్టించలేదా ? ఆయన చేసినదాన్నే పూర్వ కాలంలో అయితే 'రాజద్రోహం' అనీ 'పిరికివాడి తత్త్వం' అనీ పిలిచేవారు. నేటికాలపు పరిస్థితుల్లో వాటినే 'దేశభక్తి' అనీ 'అహింసాతత్త్వం' అనీ వ్యవహరిస్తున్నాము. పూర్వం దేశభక్తి అంటే కేవలం రాజభక్తే; ఆ రెంటికీ అవినాభావ సంబంధం. పూర్వం అహింసాతత్త్వం వ్యక్తిగతమైన, ఆధ్యాత్మికమైన గుణం. వాటికీ గాంధీగారు సంఘంలో రూపొందించిన క్రొత్త నైతిక విలువలకీ సంబంధం ఏమీ లేదు; ఆయన క్రొత్తవాటికి పాత పేర్లయితే పెట్టారుగాని! ........ సరే స్వరాజ్యం వచ్చింది, కథ ముగిసింది. జీవితం గాంధీగారి విలువల్ని దాటి ముందుకు అడుగుపెట్టిన స. చనలు కనిపించాయి. 'ఆ చీకటిలో నాకు వెలుగు కనిపించటం దు'. అని ఆయ అన్నారు. మళ్ళీ అన్వేషణ ప్రారంభిస్తూ···అంతటితో ఆయన జీవితం గొప్పగా సమాప్తి చెందింది. అంటే గాంధీ అస్తమయం దేశ చరిత్రలో ఒక దశకు ముగింపు...."

"నీ వ్యాఖ్యానం ఎలా ఉన్నా గాంధీ తత్త్వానికీ, ఆయన సూచించిన ఆదర్శానికీ చావు లేదన్నమాట అంగీకరించవా ? వాటి ప్రయోజనం దేశానికి ఇంకా ఎంతో ఉందని గుర్తిస్తూ మనం జీవితాన్ని ఆ ధోరణిలో నడుపుకోవడం కర్తవ్యం కాదా ?"

"తత్త్వానికీ విలువలకీ ఒకవిధంగా చావు వుండని మాట నిజమే. అవి పుస్తకాల్లో ఉం యి, ఉపన్యాసాల్లో ఉంటాయి. ఆ పేర్లే మళ్ళీ మళ్ళీ వాడ·తూ వుండొచ్చుకూడా! కాని, మనుష్యుల ప్రవర్తనలో, అనుభూతిలో అవి ఎంత వరకు కన్పిస్తున్నాయి అనేది ప్రశ్న.... అవి ఎప్పుడు అనుభవంలో కనిపించకపోతే అప్పుడు జీవితం వాటిని దాటేసిందన్నమాటే! ..... ఇక్కడ అంతిమ విజయం అంటూ కథల్లో లాగ ఒకటి లేదోయ్ శ్రీధర్. గాంధీగారి జీవితం స్వరాజ్య

సమరం. అదంతా ఆయన విజయమే; కాని హిందూ ముస్లిం కలహాలు, రక్తపాతం, ఆయన పోయేముందు జరిగిన హింసాకాండ ఆయన అపజయానికి చిహ్నాలు మాత్రం కావు! జీవితం గాంధీగారిని దాటి ఇంకో మలుపు తిరిగింది అనుకోవాలి అంతే! ఇక మన కర్తవ్యం అంటావా, ప్రాతవిలువలతో కొత్త జీవితాన్ని సృష్టించటానికి వీలుకాదు ఎంత ప్రయత్నించినా! నీ విలువల మాట జీవితం వినదు, జీవితం మారే విలువలు వినాలి; అంటే క్రొత్త విలువలు పుట్టుకురావాలి! .... దేశంలో రాకీయాల్లో ఇప్పుడు వస్తున్న మార్పు గమనిస్తే ఈ విషయం బాగా అర్థమవుతుంది..... ప్రకాశంగారిని ఎందుకు మద్రాసు ప్రధాని పదవినుంచి తొలగించారు అవకాశవాదులంతా కలసి? వాళ్లని అవకాశవాదులనీ స్వార్థపరులనీ మనం తిట్టిపోస్తున్నాం కాని, మనుషుల్ని, జీవితాన్నీ, మార్పునీ చూచి ఏవగించుకుంటే లాభమేమిటి! ప్రకాశంగారిలో చేవ వుంటే మళ్లీ ప్రధాని అవుతారు, లేకపోతే లేదు! జీవితస్వరూపంలో వచ్చిన ఈ మార్పుని మొదట గుర్తించకపోతే, నీ కర్తవ్యాన్ని వ్యక్తిగతంగా ఏమని నువ్వు నిర్ణయించుకుంటావ్? ఆ కర్తవ్యాన్ని ఏవో ప్రాత విలువల్తో ముడిపెట్టుకోవటం జీవితానికి ద్రోహం చెయ్యటమే!"

"రాజా! నీ వేదాంతం నాకు కేవలం వితండవాదంగానే కన్పిస్తోంది! ..... దీన్ని గూర్చి ఆలోచిస్తే గాని నాకేం అర్థమవదు.... కాని, నువ్వు నిజంగానే చెడిపోతున్నావంటే మాత్రం నేను నమ్మను."

"సరే నీ యిష్టం!..... వట్టి గుమాస్తాలా కాకుండా, జీవితాన్ని అన్వేషిస్తూ అంగీకరిస్తూ ఉండాలోయ్! లేకపోతే రానురాను నువ్వు యంత్రంలా తయారవుతావ్."

"నన్నేమీ ఎత్తి పొడవక్కర్లేదు, ముందు నీ సంగతేమిటో కాస్త జాగ్రత్తగా చూచుకో."

అలా నాగరాజు దగ్గరనుండి వచ్చేస్తూ మనసులో ఏదో బెంగ, అసంతృప్తి అనుభవించాడు తను. ఆ పరధ్యానమే కారణం కాబోలు అద్దం జారి పడిపోవ నికి .....

ఆఫీసులో ఫైళ్లు ముందేసుకుని కూర్చున్నా, నాగరాజు వాదనే మళ్లీ మళ్లీ గుర్తువచ్చి మనస్సు ఎదురు తిరుగుతోంది. శ్రీధర్‌కు పనిమీద లక్ష్యం కుదరటంలేదు.

సెక్షను చప్రాసీ ఉత్తరాలు పట్టుకొచ్చాడు. శ్రీధర్‌కు రెండు ఉత్తరా లున్నాయి. కార్డు తండ్రి వ్రాసింది. అంతా క్షేమంగా ఉన్నారనీ, అన్నయ్య చిన్నకూతురు సీతకు జ్వరం వస్తూఉండి కొంత నెమ్మదించిందనీ వ్రాశా డాయన. డబ్బుకు ఏమైనా యిబ్బందిగా ఉంటే తెలియచెయ్యమని వ్రాశాడు. రెండవ ఉత్తరం తార దగ్గరనుంచీ వచ్చింది. పాపాయి స్వరాజ్యానికి విరేచనాలు. డాక్టరు శ్రీదేవి దగ్గర కాక డాక్టరు మధుసూదనం దగ్గర మందిప్పిస్తున్నారట. తను కూడా టానిక్కులేవో తీసుకోవాలట. వెంటనే ఒక వంద రూపాయిలు పంపించమని వ్రాసి ముగించింది.

వంద రూపాయిలు ఎక్కడున్నాయి? తనకు నెల జీతమే వందకు మించటంలేదు! మామగారు యివ్వలేక కాదు, అల్లుడి ప్రయోజకత్వాన్ని నిర్దాక్షిణ్యంగా బయటకు లాగి దాసోహ మనిపించాలనే ప్రయత్నమే ఇందులోనూ కనిపిస్తోంది!

అదృష్టవశాత్తు నాన్నగారు అముక్క వ్రాశారు. డబ్బు అవసరం ఉంటే తెలియజెయ్యమని. శ్రీధర్ ప్రక్క సీటులోని తోటి గుమాస్తా నడిగి కార్డు అరువు తీసుకొని వెంటనే వ్రాశాడు. "వీలుంటే వంద రూపాయలు పంపించండి ..... తార కూడా తనకు కొంత కావాలని వ్రాసింది, పంపిస్తాను" కార్డు పోస్టుకు పంపించాడు.

ఇంతలో సెక్షను సూపర్నెంటు నుంచీ కబురు వచ్చింది. కొన్ని అర్జెంటు ఫైల్సు సిద్ధం చెయ్యలేదేమని ప్రశ్నించా రాయన. శ్రీధర్ ఆఫీసు పనిలో మునిగిపోయాడు.

సాయంత్రం ఆఫీసునుంచి బయటపడి కాఫీ త్రాగి, మెరీనా వైపు నడుస్తూంటే, నాగరాజు వాదం, మాయలత, క్రికెటరోజు పార్టీ జ్ఞాపకం వచ్చి హృదయంలో అవ్యక్తమైన వేదన ప్రారంభమైంది. నిన్నటి అనుభవం అంతటితో మరచిపోవా లనుకున్నాడు. ఈ బాధ దాన్ని అంత సులువుగా మరచిపోవటానికి వీల్లేదనే గుర్తు చేస్తోంది. మరచిపోక చేసేదేమిటో అర్థం కావటంలేదు! ఈ మధుర వేదనకూ, జ్ఞాపకానికీ ఆధారం ఒక్క అబద్ధమేనా? తనకు డబ్బులేదని మొదటే తెలిస్తే మాయలత అసలు అసలు మాట్లాడి ఉండదేమో!

తన దగ్గర విరివిగా పచ్చనోట్లు ఉంటే తప్ప తను మాయలతతో మాట్లాడటానికే వీలుండదంటాడు నాగరాజు. ఆ హెచ్చరికలో అతిశయోక్తి లేదని తనకూ తెలుసు! కాని ఊరికే తెలియటంవల్ల లోపలి వాంఛ, జ్ఞాపకం, వేదన అదృశ్యమైపోవే! తుచ్ఛమైన డబ్బు, అర్థంలేని తాహతు, యివేనా ఆధారాలు మధురానుభూతికీ, స్నేహానికీ, ప్రేమకూ, ఆకర్షణకూ!

నిజమే! తార ఉత్తరం వ్రాసిన కారణం మాత్రం— ఒక పచ్చనోటు కోసమే కదా!

తనిలా బాధపడటం దేనికి? తన పరిస్థితిలో గాంధీగారు ఏం చేసేవారు? స్త్రీల దాక్షిణ్యం కోసం, తుచ్ఛమైన వ్యామోహంతో యిలా పరితపించట మేమిటి? మనస్సుని నిగ్రహించి, దరిద్రనారాయణులైన తోటి మానవుల్ని సానుభూతితో చూడటం నేర్చుకుంటే అంతకన్న తృప్తి, ఉదాత్తత ఉంటుందా?

"బాబూ" అంటూ ఆరేళ్ల కుర్రవా డొకడు, దీనముఖంతో దీనంగా యాచిస్తూ శ్రీధర్ వైపు వచ్చాడు.

జేబు తడిమి, ఒక అర్థణా తీసి తృప్తిగా వాని చేతిలో వేశాడు శ్రీధర్. తను జీవితాన్ని ఈవిధంగానే ఎదుర్కొంటాడు! నిరాడంబరంగా జీవిస్తాడు! ఇదే గాంధీ మార్గం. క్రికెటరోజు లాగ కృత్రిమ జీవితంలో ఒక పాత్రను అభినయించవలసిన అవసర మేమిటి తనకు? నాగరాజు తన్ను గూర్చి అబద్ధం చెప్పినప్పుడే కుండ బద్దలు కొట్టినట్లు తను నిజం చెప్పవలసింది. నాగరాజూ, స్నేహితులూ, ఆ పార్టీ

ఏమైనా వుంటే తనకేం ? తన ఆదర్శాల విషయంలో తను కఠినంగా ఉండక తప్పదు ! ఈ నిశ్చయం శ్రీధర్‌కు కొంత తృప్తి కలిగించింది.

శనివారంనాడు తండ్రి దగ్గరనుంచి మనియార్డరు వచ్చింది. ఈ అయిదు రోజుల్లోనూ శ్రీధర్ తన మనస్సుని త్రవ్వి పోశాడు. తనని తాను నిర్దాక్షిణ్యంగా వేధించుకున్నాడు. కలుపు మొక్కల్ని తొలగించినట్లు బలహీనతలని దూరం చెయ్యటానికి ప్రయత్నించాడు.

తారకు డబ్బు పంపించగూడదన్న నిర్ణయానికి వచ్చాడు. అలా చెయ్యటంతో ఆమెకు తనమీద నిజంగా ఎటువంటి ప్రేమ ఉందో తెలిసివస్తుందనుకున్నాడు.

సాయంత్రం ఆఫీసు ముగిసేవేళ అవుతూవుండగా నాగరాజు వచ్చాడు. సాధారణంగా ఆదివారాలు తప్ప నాగరాజు వచ్చి కలుసుకోడు. ఆఫీసు కెప్పుడూ రాలేదు కూడా.

"ఏమిటి విశేషం ? ఇలా అనుకోకుండా ప్రత్యక్షమయ్యావ్ !" అన్నాడు శ్రీధర్.

"నీతో అర్జంటు పని ఉండే వచ్చాను. అలా వెళ్దాం రా చెబుతాను."

కాఫీహొటల్లో ప్రవేశించి కాఫీ త్రాగుతుండగా చెప్పాడు నాగరాజు. "నేను పరీక్ష ఫీజు కట్టాలి. మావాళ్ళింకా డబ్బు పంపలేదు. నువ్వేమైనా సర్దగలవా ఒక ఎనభై రూపాయలు ? సోమవారం కావాలి !"

'నా దగ్గర లేదు' అన్నమాట నోటి చివరిదాకా వచ్చి ఆగిపోయింది శ్రీధర్‌కు. తను ఏ పరిస్థితుల్లోనూ ఇకమీద అబద్ధ మాడగూడదని ఈమధ్యనే చేసుకున్న నిర్ణయం గుర్తు వచ్చింది.

"నా దగ్గర అంత డబ్బు ఎలా ఉంటుందనుకున్నావ్?" అని ఎదురుప్రశ్న వేశాడు శ్రీధర్.

"ఏమైనా బాంక్‌లో దాచావేమో, కనీసం నీ భార్య తాలూకైనా ఏదో కొంత లేకపోతుందా అన్న ఆశ !"

"నన్నే అడగటం దేనికి ?"

"నీకన్నా స్నేహితు లెవరూ కన్పించలేదు మరి అడగటానికి !" నవ్వుతూ అన్నాడు నాగరాజు.

"నేను సర్దలేకపోతే ఏమౌతుంది ?"

"ఏమిటోయ్ యీ యక్షప్రశ్నలు ! అసలు వీలౌతుందో లేదో చెప్పకుండా తమాషా చేస్తున్నావ్. ఏమౌతుందీ ? చివరి ప్రయత్నంగా మా ప్రొఫెసరుగారినే అడుగుదా మనుకున్నాను. లేకపోతే యీ పరీక్షకు వెళ్లటంలేదు, అంతే !"

"నీ ఫ్రెండు సిసీలియా నడగవా ? ఆమెకు చాలా డబ్బుందిగా."

నాగరాజు శ్రీధర్ వైపు ఆశ్చర్యంగా చూశాడు. ఆ చూపులో నాగరాజు కొంత బాధపడినట్లు అనిపించింది శ్రీధర్‌కు.

"ఊహుఁ .... అడగను" అన్నాడు రాజు.

"ఏం ఎందు కడగకూడదు ? నీకు జీవితమే ముఖ్యం, నైతికమైన విలువలు కావు గద !"

"అవును, అందుకే నా కిష్టంలేని పని చెయ్యను. ఆమెను డబ్బడగటం నా కిష్టంలేదు, అడగను, అంతే ! నాకు జీవితం ముఖ్యమని అన్నాను గాని డబ్బని అనలేదే ! ఏం చక్కగా అర్థంచేసుకున్నావోయ్ !"

శ్రీధర్ మాట్లాడకుండా కాఫీ పూర్తిచేశాడు. హొటలు బిల్లు నాగరాజే చెల్లించాడు. బయటికి వచ్చిన తర్వాత శ్రీధర్ నాగరాజు భుజంమీద చేయివేసి అన్నాడు :

"నువ్వడిగిన ఎనభై రూపాయలు యిప్పుడే యిస్తాననుకో, మళ్లీ ఎప్పుడిస్తావ్ ?"

"డబ్బు రాగానే ! పది పదిహేను రోజుల్లో."

శ్రీధర్ పర్సులోని డబ్బుతీసి ఎనభై లెక్కపెట్టాడు.

"నీ దగ్గర యింత సిద్ధంగా ఎలా ఉంది ? ఎక్కడిదీ డబ్బు ?" అన్నాడు నాగరాజు.

"ఇవ్వాళే మా నాన్నగారు పంపారు. తారకు పంపాలి అని మొదట అనుకున్నాను, ఇప్పుడు పంపటంలేదు. నువు వాడుకో వీలైనప్పుడు యివ్వు."

"ఇది నిజంగా అదృష్టమే !"

* * *

పై శుక్రవారం శ్రీధర్‌కు ఊస్టింగ్ ఆర్డర్ వచ్చింది. అతను పనిచేస్తున్న సెక్షనుకు అతని స్థానంలో యింకొక సెక్షను నుంచి ఒక గుమాస్తాను బదిలీ చేశారు. ఆ సెక్షను రద్దుచేసి అందులోని గుమాస్తాలను మిగతా సెక్షనులకు పంపివెయ్యటంతో అలా జరిగింది.

అనుకోకుండా ఉద్యోగం పోవటంతో మతి పోయినట్లయింది శ్రీధర్‌కు. శనివారం ఛార్జి అప్పగించేశాడు.

లాడ్జికి వెళ్లి పడకమీద పడుకుని ఆలోచించాడు. కాలెండరులో సినిమాతార తనను చూచి నవ్వుతోంది ! ఇప్పుడు తను చెయ్యగలిగిందేమిటి ?

ఉద్యోగం పోవటంతో అత్తవారు తనమీద విజయం సాధించినట్లే ! వాళ్లు కోరుకుంటున్నదీ అంతే ! ఇప్పుడు తను వెళ్లి వాళ్ల పంచను చేరాలని వాళ్ల అభిమతం ..... అలా జరగకూడదు ! ఇంకో ఉద్యోగంకోసం ప్రయత్నం చెయ్యాలి !

ఆలిండియా రేడియోలో శ్రీధర్ మిత్రు డొకడు పనిచేస్తున్నాడు. ఉద్యోగంకోసం అక్కడేదో ఖాళీ ఉన్నట్లు అతను చెప్పాడొకసారి. శ్రీధర్ వెళ్లి అతన్ని కలుసుకున్నాడు. అప్లికేషన్ వ్రాసి ఆఫీసులో యిమ్మనీ, ఒక వారం రోజుల్లో ఏమైందీ తెలుపుతాననీ అన్నాడు ఆ మిత్రుడు.

వారం గడిచింది. రేడియోలో ఆ ఉద్యోగం శ్రీధర్‌కు లభించలేదు. మద్రాసులో ఉద్యోగం లేకుండా సోమరిగా ఉండటం కష్టమనిపించింది శ్రీధర్‌కు. ఒకరోజు తాంబరం వెళ్లాడు.

నాగరాజు గదిలో పడుకుని చదువుకుంటున్నాడు.

"క్లాసులికి వెళ్లలేదా ?"

"పరీక్షలకి చదువుకోటానికి సెలవు లిచ్చారు .... ఏం యిలా వచ్చావే, ఆఫీసు లేదా ?"

"ఉద్యోగం పోయి రెండు వారాలు కావస్తోంది. ఊస్టింగ్ వచ్చింది."

"అయితే యిప్పుడు ఏం చెయ్యదలుచుకున్నావ్?"

"రోజూ ప్రయత్నం చేస్తూనే ఉన్నాను, ఎక్కడైనా ఖాళీలు ఉన్నాయేమోనని. లాభం కనిపించలేదు. రేపో, ఎల్లుండో గది ఖాళీచేసి మదనపల్లి వెళ్లిపోదా మనుకుంటున్నాను.'

"వెళ్లి ?"

"వెళ్లి బహుశా వ్యవసాయం చేస్తాను. మరేం చెయ్యమంటావ్ ? .... ఇంకా నిర్ణయించుకోలేదు."

నాగరాజు పైకప్పుకేసి చూస్తూ ఏమిటో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. శ్రీధర్ టేబిల్‌మీద ఉన్న పుస్తకం తీసి పేజీలు తిరగేస్తున్నాడు కొంతసేపు.

"ఎలా ఉంది నీ చదువు ? క్లాసు వస్తుందా ?"

"ఏమి చదువో ! నాలుగు రోజులైంది సీరియస్‌గా చదువు ప్రారంభించి ..... క్లాసు వస్తుందనే అనుకుంటున్నాను."

"నీకు యితర వ్యాపకాలు జాస్తి అయినవిలే ..... సిసీలియా ఏమంటోంది ?"

"ఏమంటోంది ! .... సిసీలియాకు వివాహం నిశ్చయమైంది తెలుసా ? నాలుగు నెలల్లో మిసెస్ జేకబ్ కాబోతోంది.

నాగరాజు మంచంమీద నుంచి లేచి అటు నిటు తిరుగుతున్నాడు.

"అదేమిటి ? నువ్వు చేసుకోనని చెప్పేశా వేమిటి ? ఆమె నిజంగానే ఒప్పుకుందా యింకొర్ని చేసుకోవటానికి ?" శ్రీధర్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు.

"నేను వివాహం చేసుకోనని ఆమెతో ఎలా చెప్పటమా అని ఆలోచిస్తూ సందేహిస్తూ ఉండగానే, ఆ ముక్క కాస్తా ఆవిడే ముందు తేల్చేసింది !"

"నేను నమ్మను ! కళ్లారా చూశాను ఆమె నిన్నెలా ఆరాధిస్తోందో !.... నువ్వు అబద్దాలు చెబుతున్నావు నన్ను తృప్తిపరచడానికి .... కదూ !"

"కాదోయ్ ... ఇదుగో నువ్విచ్చిన డబ్బు .... తిరిగి యిచ్చేస్తున్నా" నాగరాజు పెట్టెతీసి ఎనిమిది పదులు లెక్కపెట్టి శ్రీధర్ కందించాడు. "కావలిస్తే యీ డబ్బు నడుగు సాక్ష్యం, జరిగిన కథేమిటో చెబుతుంది ! ఇందులో ఒక విధంగా ఓటమి నాదే. సిసీలియాదే గెలుపు!"

"కథేమిటి ? ఈ డబ్బు సాక్ష్యమేమి?"

"హాస్టలుడేకి నువ్వు వచ్చావు చ డు, అప్పుడే మాస్నేహంలో చివరి అంకం ప్రారంభం కావటం! స్టేషనులో దీపాలు ఆరిపో న సమయంలో నన్ను అవతలికి తీసుకుపోయి సిసీలియా యుద్ధం ప్రకటించింది. తనకు నెల తప్పిందని చె ంది. అసలు తత్త్వమేమిటో కథ మొదటినుంచి చెబితేగాని నీకు బోధపడదు దులే!!...

"ఏడాది క్రితం మా స్నేహం, అంటే ప్రణయం, ప్రారంభమైనప్పుడు యిద్దరిమధ్యా ఒక చిన్న నాటకం జరిగింది. మర్యాద ప్రకారం నేను ఆమెను పెళ్లి చేసుకొమ్మని అడిగాను, ఆమె 'ఇప్పుడు కాదు' అని బదులు చెప్పింది. ఇదొక లాంఛనం అనుకో, ఇందులో మే మిద్దరం దొంగలమే ! తర్వాత మా ప్రణయానికి అంతరాయం లేకుండా 'అవసరమైన జాగ్రత్త' వహించే బాధ్యత మగవాడినైన నాదే నంటూ కూడా సున్నితంగా తేల్చేసింది. నే నంగీకరించాను. కాని, దురదృష్టవశాత్తు ఒక్కసారి పొరపాటు జరగనే జరిగింది. ఆమెకు నెల తప్పింది. హాస్టలుడే నాటికి వారం రోజుల పూర్వమే సూచనగా వివాహ ప్రసక్తి తీసుకుని వచ్చింది. మావాళ కు వ్రాసి వ్యవహారం తేల్చుకుంటానని చెప్పాను, కాలయాపనచేసి అసలు సంగతేమిటో గ్రహించటానికి. నిజానికి నేనూ సందిగావస్థలోనే ఉన్నాను. హాస్టలు డే ఫంక్షనులో పార్టీ తర్వాత కాబోలు అడిగితే 'ఉత్తరం రాలేదు; శనివారం లోగా చెబుతాను' అన్నాను. స్టేషనుకు వెళ్లాక ఆ చీకట్లో ప్రక్కకు తీసుకువెళ్లి ఒకే సాధింపు ప్రారంభించింది. నేను నమ్మదగినవాణ్ణి కాదట; తగిన జాగ్రత్త తీసుకోలేదట; తనకు నెల తప్పినా పట్టనట్లే ప్రవర్తిస్తున్నానట; పెళ్లి చేసుకుంటాననే నమ్మకం లేనేలేదట..... ఆ ధోరణిలో చాలా నిష్ఠూరంగా మాట్లాడింది. ఆ ధోరణి ఆమె స్వభావానికి విరుద్ధం ! ఏ ఉద్దేశంతో అలా మనసు విరిగేటట్లు మాట్లాడిందో నాకు అర్థంకాలేదు. బహుశా అది తన పరిస్థితికి సహజమైన ఆదుర్దానేమో అని కూడా అనుకున్నాను. ఎటూ నిర్ణయించలేక నిర్ణయాన్ని పై శనివారానికే వాయిదా వేశాను. నేను దేనికైనా సిద్ధంగానే ఉన్నాను, వివాహానికి తప్ప ! మొదటి నుంచీ ఆమె ధోరణి కూడా అంతే, కాని, హాస్టలుడే రాత్రి ఆమె ప్రవర్తన నన్ను బాగా తికమక పెట్టింది. చివరకు శనివారంనాడు నేను ఆమె దగ్గరకు వెళ్లగానే, డొంకతిరుగుడు లేకుండా సూటిగా తన భారం వదిల్చే ఉపాయం చూడమని చెప్పింది. వివాహం సంగతే ఎత్తలేదు ! 'వివాహం చేసుకుందాం' అని కదిలించాను, నేనే. 'మొదట ఈ బాధ్యత నిర్వర్తించు, తర్వాత తీరిగ్గా ఆలోచిద్దాం ఆ సంగతి' అన్నదామె! ఆమె అలా అనటమే నాకు అనుకోకుండా బాధ కలిగించింది ఆశ్చర్యంగా. బహుశా అది నాలోని 'అహం' తిన్న దెబ్బ ! ....

"ఏమైతేనేం, ఒక డాక్టరు దగ్గరకు వెళ్లాం, ఏదో కథ చెప్పాము; నమ్మకపోయినా నమ్మినట్లు నటించి ఒక వంద రూపాయిలు ఫీజు తెస్తే చేస్తానన్నది ఆ డాక్టరు. నా దగ్గర యిరవై మాత్రమే ఉంది, ఆరోజే పరీక్ష ఫీజు కట్టేశాను.... వెంటనే నీ దగ్గరకు వచ్చాను, నువ్వు సర్దావు. మరుసటిరోజు అంటే ఆదివారమే సిసీలియా చికిత్స పూర్తయిపోయింది.... పోతే, తన ఎంగేజ్‌మెంట్ సంగతి నాలుగు రోజుల క్రితమే ఉత్తరం మూలంగా తెలిపింది సిసీలియా. అందులో 'మా స్నేహాన్ని యింకోవిధంగా మార్చటం తన కిష్టం లేదంటూ' వ్రాసింది. చూశావా ఆ గడుసుదనం ! అంటే ఆ వాక్యానికి అర్థం ఏమిటి ? నేను పెళ్లి ప్రపోజ్ చేసినట్లూ, తను నిరాకరించినట్లూ పైకనిపించే అర్థం ... పెళ్లికంటె కూడా

'స్నేహమే' ఎక్కువ అంటూ నన్ను తృప్తిపరచటానికీ అందులోనే ధ్వని! ఇంకా ఆలోచిస్తే అసలా వాక్యం ఎందుకు వ్రాయవలసి వచ్చిందీ అని తర్కిస్తే, పూర్తిగా మా 'స్నేహాన్ని' భవిష్యత్తులో కూడా విరమించుకోవటం తనకు యిష్టంలేదని కూడా సూచన కాబోలు! ఆవిడ వ్రాసిన ఉత్తరాలన్నీ అంతే! పైకి స్నేహాన్ని మించిన వాచ్యార్థం ఎక్కడా ఉండదు వాటిలో! కానీ, అన్నీ అగాధపు అర్థాల పచ్చి ప్రణయలేఖలు! అందుకే జీవితంలో ఈసారి గెలుపు ఆమెదే అంటాను ...."

శ్రీధర్ విషయమంతా కుతూహలంగా విన్నాడు. నాగరాజు ముగించాక కొన్ని క్షణాలు మాట్లాడలేక పోయాడు. అతనిలో ఉన్నట్టుండి బాధ అసహనం ఉవ్వెత్తుగా లేచాయి.

"ఛీ! ఛీ!! ఇదా జీవితం? దీన్నా నువ్వు గెలుపూ ఓటమీ అంటూ ఉండటం! నువ్వు .... నువ్వు .... యింత పాపాన్నీ, ఘోరాన్నీ చేసి యింకా యిలా నెమ్మదిగా చెబుతున్నావా? .... థూ! ఎంత ద్రోహం చేశావ్ మన స్నేహానికీ .... నాకూ .... నన్ను మీ పాపంలో పాలు పంచుకునేలా చేశావ్? నన్నిందులోకి మోసంచేసి లాగటానికి ఏమిటి నీకు అధికారం? .... నువ్వు చెడిపోతూ నన్నూ అందులో భాగస్వామిని చెయ్యటానికి నీ కెంత సాహసం! .... ఛి! నన్ను మోసంచేశావ్! పరీక్షకోసమని చెప్పి డబ్బు తీసుకున్నావ్ .... నువ్వూ ఇంకొకర్తె కలిసి చేస్తున్న భ్రూణహత్యలో నాకూ భాగం యివ్వటానికే డబ్బు తీసుకుంటూ నాతో చెప్పకుండా ఏమిటీ ద్రోహం?.... మళ్లీ యీ పాపిష్ఠి డబ్బు .... సాక్ష్యం .... అంటూ జంకు లేకుండా ఈ కాలుష్యం నా చేతికి.... నాకు .... ఎందు కిస్తావ్?... వద్దు నాగరాజ్, నేను చాదస్తపు మనిషినే .... క్షమించు .... మనకు పొత్తు కలియటమే పొరపాటైంది .... కాదు, నువ్వు పూర్తిగా మారిపోయావు, నువ్వు నాకు తెలిసిన నాగరాజువి కావు ... ఇంక మన మెప్పుడూ కలుసుకోము జీవితంలో .... నేను వెళ్తాను!"

పట్టరాని ఆవేదన, కోపము, దుఃఖము శ్రీధర్ కంఠంలో, మాటల్లో పొంగులు వారాయి. నాగరాజు ఆశ్చర్యంతో నోట మాట రాక అలానే నిలిచిపోయాడు. శ్రీధర్ రియాక్షన్ యిలా ఉంటుందని కలలోనైనా ఊహించలేదు నాగరాజు. ఊహిస్తే అసలు విషయమే చెప్పేవాడు కాడేమో.

శ్రీధర్ లేచాడు. తన వేదనని వెళ్లగ్రక్కుతూనే జేబు నుంచీ నాగరాజు యిచ్చిన నోట్లనుతీసి టేబిల్‌మీద గిరవాటు పెట్టాడు. ఒక్క క్షణం ఆగాడు. కళ్లు తుడుచుకొని, నిగ్రహించుకొని వెళ్లిపోవడానికి ముందుకు అడుగులు వేశాడు.

నాగరాజు అతని చెయ్యి పట్టుకున్నాడు. "నన్ను క్షమించు శ్రీధర్! నేను తెలిసి నీకు బాధ కలిగించలేదు."

"దేవుడే క్షమిస్తాడు .... నన్ను వదులు .... నేను వెళ్తాను." చెయ్యి విడిపించుకొన్నాడు శ్రీధర్.

"ఏమిటి శ్రీధర్! ...." నాగరాజు అతనితో వాదించి నచ్చచెప్పాలి అనే ప్రయత్నం ప్రారంభించాడు. కాని శ్రీధర్ ఆగకుండా గబగబా నడిచి వచ్చేశాడు.

## 5

సాయంకాలపు వెలుగు క్షీణిస్తోంది.

మదనపల్లి జిల్లాబోర్డు హైస్కూలు కెదురుగా ఉన్న చెఱువుగట్టుమీద కూర్చున్నాడు శ్రీధర్. చెఱువు బొత్తిగా ఎండిపోయింది. నేల చీలికలు చీలికలుగా, ముక్కలైపోయిన పలకలా ఉంది.

మేనెల ఆఖరివారం వచ్చినా వేసవి వాన తెరలు, ఏటా వచ్చేవి, రాలేదు. ఎత్తయిన ప్రదేశం కావటంతో మదనపల్లిలో ప్రకృతి సహజసుందరంగా ఉంటుంది. కాని, ఆఏడు వఱుపుచెట్లు కూడా ఎండిపోయి కొన ప్రాణంతో ఉన్నాయి.

శ్రీధర్ మద్రాసునుంచి తిరిగివచ్చిన ఇరవై రోజులకు అన్నయ్య కూతురు సీతకు జ్వరం తిరగబెట్టి అకస్మాత్తుగా మరణించింది.

ఆ చెఱువూ, చెఱువుగట్టూ శ్రీధర్ హైస్కూలు జీవితంతో అంకితమైపోయిన ప్రదేశాలు. పదేళ్ల వయస్సులో హైస్కూలు ప్రవేశించినప్పుడు, ఆ చెఱువులో ఒకమూల శవాల్ని దహనం చేసేవారని తెలిసినపుడు, మృత్యువును గూర్చీ, దయ్యాలను గూర్చీ తనలో కలిగిన ప్రశ్నలూ, భయాలూ, ఊహలూ, అనుభవాలూ యిప్పుడు జ్ఞాపకం వస్తున్నాయి.... వర్షాకాలంలో చెఱువు నిండి అలలతో గట్టుని తాకుతూ గలగల శబ్దం చేస్తూఉంటే, చెఱువుగట్టుమీద నిల్చుని దక్షిణపు దిక్కు చూస్తూ, ఆలోచించి ప్రశ్నించుకునే శ్రీధర్‌కు దెయ్యాలమాట వట్టి అబద్ధమే అనిపించేది .... కాని, చెఱువులో నీళ్లు తగ్గిపోయిన తర్వాత, ఎప్పుడైనా కానుగచెట్లు గుంపుగా ఉన్న ఆ మూల ఏదో మంట కనిపిస్తే, అనురసంధ్య వేళ ఏదైనా దీపంవంటి వెలుగు కనిపిస్తే, దెయ్యాల ఉనికి మాట వాస్తవమే ననిపించి ఝల్లున గుండె జలదరించేది.

చీకటిపడుతున్నవేళ ఫుట్‌బాల్ ఆట పూర్తిచేసుకుని యింటికి వెళ్లేముందు కొంతసేపు ఒకరిద్దరు మిత్రులతో చెఱువుగట్టుమీద విశ్రాంతిగా, నిశ్శబ్దంగా కూర్చోవటం అలవాటైంది అతనికి. ఒకసారి స్కూల్లో 'ప్రార్థన' ను గూర్చి ఉపన్యసిస్తూ థియోసఫిస్టు శేషాద్రిగారు సూర్యాస్తమయవేళ నిశ్శబ్దంగా ధ్యానముద్ర వహించటం అలవాటు చేసుకొమ్మని చెప్పారు. శ్రీధర్ వీలున్నప్పుడల్లా అలా చెయ్యటం ప్రారంభించాడు. ఆ అలవాటు మూలాన్నే యిప్పటికీ మదనపల్లిలో చీకటి పడేవేళ ఆ చెఱువుగట్టుమీద కూర్చోవటం ఒక విశిష్టమైన అనుభవం అతనికి.

మనస్సుని స్వేచ్ఛగా గాలిపటంలా వదిలిపెట్టి కూర్చుంటే ఆ రోజుల్లో ఒక ప్రశాంతమైన ఆనందంతో మనస్సు నిండిపోయేది. కూర్చున్న దగ్గరి మట్టీ, చెఱువులో నీటి కదలికా, అటు నిటు తిరిగే పల్లెటూరి జనం, ఆకాశంలో అస్తమయం వల్ల కలిగే రంగుల మార్పులూ, క్రమంగా చీకటి ముసుగులో నిశ్శబ్దంలో లీనమౌతున్న ప్రకృతీ, ప్రతి వస్తువూ, దృశ్యమూ ఆనందహేతువులుగానే ఉండేవి..... వర్తమానం అనే ప్రాంగణంలో ఉత్సాహంగా కాలి మునివ్రేళ్లమీద నిల్చుని

భవిష్యత్తువైపు చూస్తూ జీవిత దేవాలయంలో ప్రవేశం కోసం ఎదురుచూస్తూన్న రోజులవి ..... అది ఒక స్వచ్ఛంద మనఃస్థితి.

ఆంజనేయస్వామి కోవెలలో గంటలు మ్రోగేవి. చెఱువు గట్టు దిగి, రోడ్డు దాటి, స్కూలు ఆవరణా గ్రౌండు దాటగానే ఏటి ఒడ్డున ఉంది ఆంజనేయస్వామి కోవెల. ఆదివారాలు అక్కడ జనం ఎక్కువగా ఉంటారు. అది తను నిత్యమూ యింటికీ, స్కూలుకీ నాలుగుసార్లు తిరిగే దారి. అప్పటి జీవితానికి మరొక స్మృతిచిహ్నం ఆ కోవెల. ఒకసారి ఆ కోవెల ప్రక్కనున్న కోనేటిలో పదహారేళ్ల హైస్కూలు అమ్మాయి శవం తేలింది. శ్రీధర్ అప్పుడు రెండవఫారం చదువుతున్నాడు, ఆ అమ్మాయి స్కూలుఫైనలు క్లాసులో ఉండేది. బడిపిల్లలందరూ గుంపులు గుంపులుగా వెళ్లి చూశారు. ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకోవటానికి కారణం గర్భవతి కావటమేనని అనుకున్నారు కూడా. ఆ సంఘటన అప్పట్లో అతన్నేవిధంగానూ కదలించలేదు.... ఇప్పుడాలోచిస్తుంటే తెలుస్తోంది, ఆ రోజుల్లో జీవితంలోని అపస్వరాలు తను అసలు గమనించలేదు !....

మృత్యువుకు అర్థం ఏమిటి ? జీవితం ముగియటం, ఈ లోకంలో అనుభూతి ఆఖరు కావటం .... తర్వాత యితర లోకాలు వున్నాయో లేవో అది తేలని విషయం. విశ్వాసాలు రకరకాలుగా ఉంటాయి. దివ్యజ్ఞాన సమాజంవాళ్లు ప్రయోగాలు చేశామంటారు. రెండేళ్లు వాళ్ల కాలేజీలో చదివినా లెక్చరరు శేషాద్రిగారితో వెళ్లి మాట్లాడినా, శ్రీధర్‌కు ఆ విషయాలను గూర్చి ఏమీ సరిగా తెలియలేదు.... "The wages of sin is death" అని లయోలా కాలేజీలో ఆధ్యాత్మిక ప్రసంగాల్లో కేథలిక్కు ఫాదర్ నొక్కి చెప్పేవాడు.... కోనేటిలో పడి మరణించిన అమ్మాయి పాపానికి ఫలితమే మృత్యువు అని అన్వయించినా, ఆ వాదన యిప్పుడెవరూ ఆమోదించటంలేదు ! సంఘంలో దృక్పథం, విలువలూ మారుతున్నాయి. నాగరాజు వంటి అధునాతనుల వాదన ప్రకారం నీతికి జీవితాన్ని శిక్షించి నాశనంచేసే అధికారమే లేకపోతే పాపానికీ, మృత్యువుకీ సంబంధం, అన్వయం ఎక్కడ ? ....పోనీ ఆ వాదం ఎలా ఉన్నా, సీతవంటి ముగ్ధ ప్రకృతులు ఆకస్మికంగా అదృశ్యమై పోవటంలో ఏం న్యాయం ఉంది ? వాళ్ళు ఏ పాపమూ చెయ్యలేదే !

నైర్మల్యము, ముగ్ధత్వము, మంచితనము, సౌందర్యము—వీటికి సృష్టిలో రక్ష లేకపోవటం ఎందుచేత ? పాపం పెరిగి విలువలు తారుమారౌతున్న అసురసంధ్యయొక్క లక్షణమే యిది అని సరిపెట్టుకోవాలా ? .....

ఇక్కడిదాకా వచ్చి శ్రీధర్ ఆలోచన ఎప్పుడూ ఆగిపోతోంది. అతని ప్రశ్నకు సరియైన సమాధానం లభించదు. ఇది ఇప్పుడే కాదు, గాంధీ చనిపోయిన సాయంత్రమూ, నాగరాజుతో స్నేహబంధం త్రెంచుకొని వచ్చేసిన సమయంలోనూ, సీత మరణించినరోజూ, అతణ్ణి బాధించి పీడించిన ప్రశ్నే !

సీతకు శ్రీధర్ దగ్గర చాల చనవు. దానికి ఆ చలాకీతనం, ఆ ఆప్యాయతా వయస్సుకు మించినవి. అతనిమీద దానికి సర్వాధికారం ఉండేది. తెల్లగా స్వచ్ఛంగా, పాల నురగలా ఉండే సీత వెన్నెలలా మరపించి, స్వప్నంలా అదృశ్యమైపోయింది.

ఒకసారి సీత మారాముచేస్తూ తల్లిమీద అలిగి తల్లినేదో తిట్టింది. అంతలో శ్రీధర్ అక్కడికి రాగా, వదినె "చూడు సిరీ, యిది ఎలాంటి పాడు మాటలు నేర్చుకుని వచ్చి తిట్టుతోందో ! బొత్తిగా భయమూ, భక్తీ లేకుండా పోయినై. గట్టిగా రెండు దెబ్బలు పడనీ" అంటూ శిక్షించమని తన్ను పురమాయించింది. "ఏమిటి సీతా ?" అని గద్దిస్తూనే సీతను దగ్గరికి తీసుకోబోయాడు. "ఫో, నా యిష్టం" అంటూ సీత తిరస్కరించింది పారిపోబోయింది. అప్పుడు తను రెక్క పట్టుకుని ఆపి, దాన్ని వీపుమీద చిన్నగా చరిచాడు.... "ఇంకొకటీ" అంటోంది వదినె .... సీతకు కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ఏడుపు పైకి పెగలకుండా పెదవులు బిగబట్టి అలాగే నిలిచిపోయింది. సీతను చప్పున ఎత్తుకున్నాడు. అప్పుడు సీత ముఖాన్ని దాచుకుంటూ తన భుజం తడిపివేసింది. ఆపిల్ల ఏడుపుశబ్దం పైకి రాకపోవటం ఆశ్చర్యం కలిగించింది..... మరుసటిరోజు అనునయంగా సీతకు తల్లి చెబుతోంది : "నువు తప్పు చెయ్యకపోతే ఎవరైనా ఎందుకు దండిస్తారే ?" అంటూ. సీత వాదిస్తోంది : "తప్పుమాట అనొద్దు అనగూడదా ? బాబాయితో నన్ను కొట్టమని చెప్పావు !" అంటూ తల్లిని నిలవదీస్తోంది. "అమ్మ చెబితే మాత్రం నువ్వెందుకు కొట్టాలి నన్ను ?.... నన్నింకా యింకా కొట్టమని చెబుతోందే అమ్మ ! ... నేనంటే మీకు యిష్టంలేదు !" అని తనతోనూ వాదించింది. సీత తర్కానికి తనూ, వదినా యిద్దరూ విస్తుపోయారు. "ఎక్కడ నేర్చావే యీ గడుసు మాటలు !" అన్నది వదినె ... సీతకు ఆ వయస్సులోనే అంత భావ పరిపక్వత, నైశిత్యం, ఆత్మాభిమానం ఎలా వచ్చాయో ! సీతలో ఒక అసాధారణ వ్యక్తిత్వం ఉందనీ, సీత జీవితం భవిష్యత్తు గొప్పగా ఉంటాయనీ కలలు కన్నాడు తను. ఆ సీత బ్రతికి బట్టకట్టలేదు !...

పొలందగ్గర మామిడితోటలో గొయ్యి తీశారు. ఇరుగ్గా ఉన్న ఆ గోతిలో సీత బంగారు దేహాన్ని బోరగిలపెట్టి ఆ మిగిలిన ఒక్క వస్త్రాన్నీ తీసేశారు. "వస్త్రం తియ్యొద్దు" అన్నాడు తను. "అలా కాదు, ఎలా వచ్చినవాళ్లు అలా పోవాలని శాస్త్రం. బట్ట ఉండకూడదు, తీసెయ్యండి" అన్నాడు ఒక వృద్ధుడు.

సీత జ్ఞాపకం మళ్లీ మళ్లీ రేగుతున్న గాయం. సీతను గూర్చిన ఆలోచన గొంతుక నొక్కేస్తుంది. స్థిమితంగా కూర్చుండనీదు. ఏం చెయ్యాలో తెలీని ఆవేదన మనస్సును కాల్చివేస్తుంది.....

వెలుగునీడలు .... వెలుగు క్షీణించి అదృశ్యమైపోయింది. నీడ దట్టమై పరివ్యాప్తమయిన చీకటి ప్రారంభమైంది.

శ్రీధర్ యింటికి తిరిగి వచ్చాడు.

అతనికి అప్పుడే శ్మశానం నుండి తిరిగి వచ్చినట్లుగాఉంది.

బావి దగ్గర నీళ్ళు చేది శీర్ష స్నానం చేశాడు. కాని తాపం ఏమాత్రం తగ్గినట్లనిపించటంలేదు.

తువ్వాలుతో తడి ఒత్తుకుంటూ ఉంటే వదినె రుక్మిణమ్మ చూచి అన్నది : "ఇప్పుడు తలస్నానం చేశావేమిటి ? చెబితే వేన్నీళ్ళు పెడుదునే !"

"చన్నీళ్ళు పోసుకోవటమే బాగుంది వదినా !"

సీత పోయిన దగ్గరనుండి ఆమె ముఖంలో చిరునవ్వే లేదు. మౌనంగా తన పని తను చేసుకుంటూ ఉంటుంది. నాలుగు మాటలు మాటాడేచోట ఒక్కమాటే అంటుంది. ఆమెలోని ఈ మార్పువల్ల శ్రీధర్ ఆమెను పూర్వంలా తనకు కావలసినవన్నీ అడగలేక పోతున్నాడు. అన్నీ తనే చేసుకుంటున్నాడు.

గదిలోకి వెళ్ళి బట్టలు వేసుకుని, తల దువ్వుకొంటున్నాడు శ్రీధర్. రుక్మిణమ్మ వచ్చి వాకిట్లో నిలబడ్డది.

"తార దగ్గరనుంచి ఉత్తర మేమైనా వచ్చిందా ? ఎప్పుడొస్తుందట ?" అన్న దామె.

"ఏమో తెలీదు" అన్నాడు తిరిగి చూడకుండానే. "నువ్వెప్పుడు వెళ్దాం అనుకుంటున్నావ్ ?"

"ఏమీ అనుకోవటంలేదు."

"ఆ దీపంలో నూనె ఉందా ?"

శ్రీధర్ దీపం కదిలించి చూచి "ఉంది, నిన్ననే పోశాను" అన్నాడు. రుక్మిణమ్మ వెళ్ళిపోయింది. కుర్చీలో కూర్చుని ఏదైనా పుస్తకం కోసం వెదికితే, టాగూరు 'గీతాంజలి' కనిపించింది. ఆత్మోపశాంతికి ఆ పుస్తకం తరచూ పనికివస్తూ ఉంటుంది అతనికి.

పుస్తకం తెరవగానే—"మృత్యువు నీ ద్వారం దగ్గర నిలబడి తలుపు తట్టుతుంది, నువ్వు యివ్వగలిగిం దేమిటి ?" అన్న వాక్యాలు కనిపించాయి. ఆ మాటలు తనను వెక్కిరిస్తున్నాయా అనిపించింది.....

ఊహించుకోవటానికి ఉదాత్తంగా, ప్రశాంత గంభీరంగా, మధురంగా ఉండే భావనకూ ప్రత్యక్షానుభవానికీ ఏమిటి సంబంధం ? మృత్యువును అతిథిగా ఎదుర్కొని మన్నించమనడం ఎంత హాస్యాస్పదంగా ఉంది ! కవిత్వంలో మృత్యువును గూర్చిన స్వప్నాలు రంగులో తీర్చి దిద్దుకోవచ్చునేమో, సీత మృతిని గూర్చి అలా సరిపెట్టుకోవటానికి వీలౌతుందా ?

భక్తి మధురమూ, ప్రేమ మధురమూ అయిన భావ కవిత్వం దోహదంగా, ఒక ఆదర్శం అతనిలో వేరూని, పెరిగి పెద్ద వటవృక్షమే అయింది. దాని నీడలో నిలుచున్నాడు. కాని చల్లని నీడ బదులు వడగాలి సోకుతోంది ..... వృక్షం వృక్షమే 'అస్తి—నాస్తి' విచికిత్సలో పడిపోయే ప్రమాదం, నిలువ నీడలేని పరిస్థితి ఎదురవుతోంది.

"చిన్నాన్నా, నిన్ను తాతయ్య రమ్మంటున్నారు." అన్నది శ్యామల గదిలోకి వస్తూ.

శ్యామలకు పదమూడేళ్ళు. ఫోర్తుఫారం చదువుతోంది.

శ్యామల అతని దగ్గరకు వచ్చి టేబిల్‌మీద మోచేతులాన్చి వంగి ఏదో పుస్తకం చూస్తూ నిల్చుంది. శ్రీధర్ కదల్లేదు, 'గీతాంజలి' వైపు చూస్తూనే ఆలోచిస్తూ ఉన్నాడు.

కొంతసేపటికి శ్యామల అతని వైపుకు తిరిగి "ఫో, పిలుస్తున్నారు" అన్నది.

"ఎందుకూ ?"

"ఏమో వెళ్ళి అడగరాదూ తెలుస్తుంది." అంటూ శ్యామల నవ్వింది అతని పరధ్యానానికి.

శ్రీధర్ లేచి వీధి గుమ్మం ప్రక్కనున్న గదివైపు వెళ్ళాడు.

శ్రీధర్ తండ్రి రామలింగయ్యకు వయస్సు ఎక్కువ లేకపోయినా దేహరుగ్మతవల్ల ఎప్పుడూ ఆ గదిలోనే ఉంటాడు. కాలకృత్యాలు తీర్చుకోవటానికీ, భోజనానికీ తప్ప ఆయన గది విడిచి కదలడు.

"అమ్మాయి తార ఎప్పుడు వస్తుంది ? బిడ్డకు అయిదో నెల ప్రవేశించిందేమో !"

"తెలీదు.... అవును, అయిదో నెల."

"వెంకయ్యగారికి జాబులు వ్రాసే సంప్రదాయం ఉన్నట్లే లేదు ! వాళ్ళేమనుకుంటున్నారో అమ్మాయైనా నీకు వ్రాయలేదా ?"

"లేదు... ఈ నెలలో వస్తుందేమో."

"నువ్వు వెళ్ళి తీసుకువస్తే బావుండదూ ! ఎప్పుడు వెళ్ళాలనుకుంటున్నావ్ ?"

"నేను వెళ్ళదలచుకోలేదు."

ఆయన నిదానించి శ్రీధర్ వైపు చూశాడు. తర్వాత క్రింద ఉన్న చేతి కర్రను మెల్లగా వంగి తీసుకున్నాడు. పరిస్థితిని అర్థంచేసుకోవటానికి ఆయన చేస్తున్న ప్రయత్నానికి అది సూచన :

"ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్నావనేనా నీ సందేహం ! దానికేమిటి ? ఎప్పుడు ప్రాప్తమో అప్పుడే వస్తుంది ! కాలం కలిసిరావాలి ..... అయినా ఉద్యోగం లేకపోతే మనకు జరగని దేమిటి ? అలాంటి సంకోచాలు నీ కనవసరం....."

శ్రీధర్ హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. కొడుకు ఆలోచనల్నీ, మర్మవేదనల్నీ యింత చక్కగా అర్థం చేసుకోగల తండ్రు లెంతమంది ? .... తనెంత అదృష్టవంతుడు !

రామలింగయ్య రెండుసార్లు వివాహం చేసుకున్నాడు. ఆయన మొదటి భార్య కొడుకు నరసింహులు. నరసింహులికి పదకొండోయేట మాతృవియోగం కలిగింది. తర్వాత ఏడాది తిరక్కుండానే జానికమ్మని చేసుకున్నాడు రామలింగయ్య. ఆమె బిడ్డ శ్రీధర్. రెండో భార్య అయినా జానికమ్మ సవతి కొడుకు నరసింహుల్ని కన్నకొడుక్కంటే ఎక్కువగా చూచేది. శ్రీధర్‌కు తొమ్మిదేళ్ళ వయస్సులో జానికమ్మ మరణించింది. మళ్ళీ యింట్లో ఆడదిక్కు లేకపోవటంతో, రావ

లింగయ్య యీసారి యువకుడైన నరసింహులికి వెంటనే వివాహం చేశాడు. క్రొత్త కోడలు రుక్మిణమ్మ, వదినెగానే, శ్రీధర్‌కు తల్లిలేని లోటు తీర్చింది. అప్పటి కామె వయస్సు పద్దెనిమిదేళ్లే అయినా అరిందాలాగా సంసారభారం సమర్థంగా సంతోషంగా మోసింది. శ్రీధర్‌ని కన్నబిడ్డలా ఆదరించింది. ఆ యింట్లో ఆడవాళ్ల సంప్రదాయం అటువంటిది! ఈ విషయాలు గుర్తు వచ్చినప్పుడు శ్రీధర్ వదినెనూ, తన తల్లినీ ఆదర్శమహిళలుగా భావించి, మనస్సులోనే నమస్కరించి గర్విస్తూ ఉంటాడు.

"నరసింహులు ఎడ్లు కొంటానికి డబ్బు తక్కువ పడిందంటున్నాడు. నీదగ్గరేమైనా ఉందా ?:' అన్నాడు రామలింగయ్య.

సందేహిస్తూ తల అడ్డంగా ఊపాడు శ్రీధర్.

"అవును, ఎలా ఉంటుంది ? అక్కడి దక్కడే సరిపోయి ఉంటుంది. నువ్వు వచ్చేముందు నేను పంపిన వందా తారకు పంపావా ?"

"లేదు !"

రామలింగయ్యకు సందేహం కలిగింది.... ఒక్కొక్కసారి ఆయన శ్రీధర్‌ను ఇంకా చిన్న కుఱ్ఱవాడిగానే చూస్తూ ఉంటారు. విద్యార్థిదశలో ఎలా నిశితంగా పరీక్షించేవాడో అలానే పరీక్షిస్తూంటాడు అనుమానం వచ్చినప్పుడు. సాధారణంగా ఆయనకు కొడుకు మీద నమ్మకమే క్కువ..కాని మద్రాసులో, కోడలు కాన్పుకు వెళ్లినరోజుల్లో, ఏమీ తోచక ఎటైనా దా తపేడే నా కొడుకు అని లీలగా అనుమానం తగిలింది ఆయనకు. తా ను తీసుకరాడని వెళ్లమంటే శ్రీధర్ వహిస్తున్న ముభావం కూడా ఆ అనుమానా కొంత బలపరిచింది..

"అయితే ఎలా ఖర్చయిం ?"

"ఒక స్నేహితుడు తన అవసరానికి చేబదులుగా తీసుకున్నాడు."

"ఇంకా తిరిగి యివ్వలేదా?"

"లేదు."

"ఇస్తాడని నమ్మకమేనా?

"ఆఁ!"

"అయితే ఒక టెలిగ్రాం యివ్వు వెంటనే సర్దమని."

తండ్రి ధోరణిలో శ్రీధర్ వెంటనే గుర్తించాడు ఆయనకు తనమాట మీద ఏదో అపనమ్మకం కలిగిందని.. లేకపోతే అంత నిర్బంధంగా టెలిగ్రాం యివ్వమని చెప్పేవాడు కాడు!

రాత్రి ఆలోచన తెమల్లేదు శ్రీధర్‌కు. తను జీవితంలో ఏ మెట్టులోవున్నాడో ఆలోచించుకోలేక పోతున్నాడు.. తండ్రి చేత దండింపబడుతూ యదార్థం చెప్పలేని పసిపిల్లవాడా? కాదే! తనకు వివాహమైంది, పితృత్వం కూడా సిద్ధించింది... కాని భార్యను అదుపులో పెట్టుకోగల శక్తి ఏదీ తనకు?..ఆదర్శాలతో తన వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాలను కుంటున్నాడు. తండ్రికి తెలీనివెన్నో తనకు తెలుసు.. కాని తండ్రిముందు నోరు విప్పి యథార్థాన్ని చెప్పే ధైర్యమే లేదు!..ఏమిటీ దైన్యం? ఏమిటీ అయోమయత్వం?

యథార్థమే అంటునా కొన్ని విషయాలు విపులీకరించి చెప్పటానికి మనస్సురాదు. ఒకవేళ చెప్పినా అవి పైవాళ్లకు అర్థంకావు. నాగరాజు సంగతి ఏమని చెప్పను? అతను డబ్బు ఎగవేశాడని చెప్పటానికి ఇష్టంలేదు. తనే డబ్బు తిరగ్గొట్టానని చెబితే, అది ఒక పిచ్చివాని చేష్టలా కనిపిస్తుందే తప్ప తన ఆంతర్యం అర్థంకాదు ఎవరికీ!

తను జవాబు చెప్పలేక పోవటం, డబ్బు సంగతి తేల్చకపోవటం తండ్రికి సందేహాన్ని ఎక్కువే చేస్తుంది మరి! తన బాధ్యత యిప్పుడెలా నిర్వర్తించాలి?

ఎక్కడైనా బదులు తెస్తే బాగుంటుందేమో!

ఎవరి నడిగితే బాగుంటుందో చాలసేపు తర్కించి, చివరకు మేనత్త మంగమ్మ నడిగి చూద్దామని, ఆమె తప్పకుండా సర్దుతుందనీ నిశ్చయించుకున్నాడు శ్రీధర్.

శ్రీధర్ మేనత్త మంగమ్మను ఆ ఊళ్లోనే యిచ్చారు. పుట్టింటిమీద అధికారం వదులుకోవటం ఆమె కెప్పుడూ యిష్టంలేదు. రామలింగయ్యగారి యిద్దరి భార్యల జీవితకాలంలోనూ మంగమ్మ మాటే జరిగింది. తనకు పిల్లలు లేకపోవటంతో మంగమ్మ మొదటినుంచీ నరసింహుల్ని తన యింట్లో పెట్టుకోవాలనే ఉద్దేశంతో ఉండేది. నరసింహులు విషయంలో కల్పించుకుని, తన భర్త తమ్ముని కొమార్తెనిచ్చి చేయాలనే ఏర్పాటు ఆమె స్వతంత్రించి చేసింది. కాని రామలింగయ్య అలా జరగనివ్వలేదు. రామలింగయ్యకు మంగమ్మ భర్త అయిన ఓబయ్యమీద గాని అతని తమ్మునిమీద గాని సదభిప్రాయం లేకపోవటమే అందుకు కారణం. మంగమ్మకు తన మాట నెగ్గకపోవటంలో అన్నగారిమీద కోపం వచ్చింది. ఆ కోపం క్రొత్త కోడలుగా వచ్చిన రుక్మిణిమీద క్రమంగా కేంద్రీకృతమైంది. ఉన్నదానికీ, లేనిదానికీ రుక్మిణమ్మను దూరుతూ యాగీచేసి, చివరకు అన్నగారి యింటి గడప తొక్కటమే మానేసింది మంగమ్మ.

నరసింహులికి వివాహమై రుక్మిణమ్మ యింటికి వచ్చే నాటికి శ్రీధర్ పదేళ్లవాడు. మంగమ్మ క్రమంగా తన ఆసక్తినీ, అభిమానాన్నీ శ్రీధర్ వైపు మళ్లించుకొన్నది. అన్నగారి యింటికి వెళ్లటం మానుకున్నప్పటికీ, శ్రీధర్‌ని బలవంతం చేసి తన యింటికి రప్పించుకోవటం మానలేదావిడ. స్కూలు వదిలే సమయానికి స్వయంగా అక్కడికి వెళ్లేది. హైస్కూలు దగ్గరే సంత కావడంతో, ప్రతి మంగళవారం స్వయంగా సంతకు వెళ్లే అలవాటున్న మంగమ్మ, వస్తువులు కొని పాలేరు చేతికిచ్చి పంపి, తను స్కూలు దగ్గరకు వెళ్లేది మిఠాయి తీసుకుని శ్రీధర్ కోసం. వీలైతే శ్రీధర్‌ను వెంటబెట్టుకుని ఇంటికి తీసుకువెళ్లేది. శ్రీధర్ కాస్త పెద్దవాడైన తర్వాత, అత్తయ్యను స్కూలు దగ్గరకు రావద్దని చెప్పేశాడు. శనివారమో, ఆదివారమో సెలవు రోజున తనే మంగమ్మ ఇంటికి వెళ్లేవాడు.

రుక్మిణమ్మను గూర్చి ప్రశ్నించటం, ఆమెను నూటిగానూ, వ్యంగ్యంగానూ విమర్శించటం చేసేది మంగమ్మ శ్రీధర్ మనస్సు శ్రీధర్‌ను తనవైపు త్రిప్పుకోవటానికి. కాని మారుమాట లేకుండా అంతా విని, విన్నదాన్ని అక్కడే గాలికి వదలిపెట్టి యింటికి వెళ్ళేవాడు శ్రీధర్. వదినె అతనికి ఏ లోపమూ రానివ్వటంలేదని అతనికి ప్రత్యక్షంగా తెలుసు. అయితే ఒకరిముందు యింకొకరి ప్రసక్తి తెచ్చేవాడు కాడు. అది అతనికి సహజంగా వచ్చిన గుణం.

హైస్కూలు చదువు ముగించుకొని కాలేజీలో ప్రవేశించాక శ్రీధర్‌లో వ్యక్తుల్ని గూర్చిన విమర్శ, మంచి చెడ్డలు, నిజానిజాలు నిశితంగా తర్కించటం ప్రారంభమైంది. అతనికి అత్తయ్య నోరు మంచిదికాదనే విషయం క్రమంగా మనస్సులో గోచర మవటమే కాకుండా, వదినెమీద గౌరవభావం కూడ ప్రస్ఫుటమైంది. అంతటితో మేనత్త యింటికి రాకపోకలు చాలవరకు తగ్గించేశాడు.

మద్రాసులో ఉద్యోగం ముగించుకొని మదనపల్లి వచ్చిన తరువాత శ్రీధర్‌ను ఉగాది పండుగనాడు తన యింటికి రమ్మని కబురుపెట్టింది మంగమ్మ. శ్రీధర్ ఆరోజు వెళ్ళకుండా శ్రీరామనవమికి వెళ్ళాడు. మంగమ్మ రుక్మిణిని ఆడిపోసింది. శ్రీధర్ కోసం తెచ్చుకున్నాడు. అతనికోసం తెచ్చి ఉంచిన క్రొత్త బట్టలు అందజేస్తూ కన్నీళ్ళు పెట్టుకున్నది. వయోవృద్ధ, సంతాన విహీన అయిన మేనత్త తనమీద ఎన్నో ఏళ్ళుగా అభిమానం చూపిస్తూంటే తను చూపిస్తున్న ఔదాసీన్యం ఒక అల్పత్వంగా, హృదయంలేనితనంగా తోచింది శ్రీధర్‌కు. ఇకనుంచి ఆమె మనస్సుకు నొప్పి కలిగించకూడదని నిశ్చయించుకున్నాడు ఆరోజు .....

నిశ్చయించుకున్నాడే కాని శ్రీరామనవమి తర్వాత మళ్ళీ యిప్పటిదాకా మంగమ్మ యింటికి వెళ్ళనేలేదు శ్రీధర్.

రామలింగయ్య డబ్బును గూర్చి ప్రశ్నించిన మరునటి రోజు ప్రొద్దున తొమ్మిది గంటలవేళ మేనత్త యింటికి వెళ్ళాడు శ్రీధర్. తలవని తలంపుగా వచ్చిన శ్రీధర్‌ను ఆప్యాయంగా పలుకరించింది మంగమ్మ. తారా, పాపాయీ ఎలా ఉన్నారని ప్రశ్నించింది. తార ఎప్పుడు వస్తుందని అడుగుతూ, వీలైతే తను కూడా బందరు రావాలనుకుంటున్న కోరికను వ్యక్తపరచింది.

సీత పోవటంతో ఎవరి మనస్సులూ సరిగా లేవనీ, అందువల్లనే తను బందరువెళ్ళే విషయం కూడా ఇంకా ఏమీ నిర్ణయించుకోలేదనీ సమాధానం చెప్పాడు శ్రీధర్.

"ఎవరు చేసుకున్నంత వారికీ, ఎవరి సంసారాలు వాళ్ళవి! నువ్వు నీ భార్యనీ, పిల్లనీ యింకా తీసుకురాకపోవట మేం బాగు లేదు సిరీ! దక్కని పిల్లని గూర్చి ఆలోచించటం మానేసి నీ కూతురు ఎలా ఉందో దాన్ని గూర్చిన వివరాలు చెప్పుంటూ ! చా ంనచాయ అన్నావు. నా పోలిక లేమైనా వచ్చాయుంటావా లేదా ? నీ మేనత్త పోలికలు రాకుండా ఉంటాయా పిల్లకి ! అస్తమానం నీ కూతురే నా కళ్ళల్లో మెదుల్తూం

మూలశంకకు
త్వరగా నమ్మకమైన
హెడెన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా! తీవ్రంగా దురద వుందా? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స ఎంతమాత్రము కాలయాపన చేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారితీసి- శస్త్ర చికిత్స తప్పనిసరి ఔతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి. ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేపనము. 108 దేశాలలో వైద్యులందరూ శిఫారసు చేస్తున్నారు. హెడెన్‌సా శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తుంది—విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు. హెడెన్‌సాలో ఉండే అమోఘమైన మందులు సామర్థ్యంగా గుణాన్ని కలిగించిరక్తశంకలను ముకుళింపజేసి ఆరోగ్యకరమైన టిస్యూ రంధ్రాలప్రవృద్ధికి సహకరిస్తుంది. గమనించండి. మూలశంకలకు సకాలంలో హెడెన్‌సా చికిత్సచేసుకుంటే ముమ్ముందు శస్త్ర చికిత్స అవసర ముండదు! హెడెన్‌సాలో మత్తును కల్గించే మందులు ఏమియు లేవు.

అసలైన జర్మన్ సూత్రాలకు అనుగుణంగా ఇండియాలో వీరిచే తయారు చేయబడుచున్నది.

దిడాలర్ కంపెనీ
337, తంబుచెట్టి స్ట్రీటు మద్రాసు-1.
ప్రసిద్ధి పొందిన కెమిస్టు లందరివద్ద లభిస్తుంది.

B3-DOL-2A TG

ర చేవు ..... ఎలా ఉంటుందా, ఎప్పుడు చూద్దామా, ఎత్తు ముద్దాడుదామా అనే తప్ప నా బతుక్కి మరో ఆశ లేదు !"

" కర్త కాదు అత్తా ! సీతలాంటి పిల్లలు నాటికీ కోటి ఒక్కరు ..... దాని గుణం, చక్కదనం, తెలివీ అన్నీ అపురూపమే !"

"ఆఁ ! చచ్చినవాళ్ల కళ్లు చారడేసి ! ఏమైనా కన్న తల్లీ దండ్రీ బుద్ధులు సరిగాలేకపోతే పిల్లలు బ్రతకరు సిరీ ! .... నువ్వు ఉగాదినాడు రాకపోతే నా మనస్సు ఎంతగా నొచ్చిందనో ! ఆ రోజల్లా ఏడుస్తూనే ఉన్నాను .... నన్నేడి పించిన పాపం వూరికేనే పోతుందా ?"

శ్రీరామనవమి తర్వాత రోజునే సీత పోయింది. ఆ విష యాన్ని గుర్తుకుతెస్తూ రుక్మిణమ్మను గూర్చి అంటున్న మాటలకు శ్రీధర్‌కు బాధ కలిగింది. కాని, వచ్చిన కార్యం గుర్తుకు తెచ్చుకుని మౌనంగా ఉన్నాడు.

వ్యవసాయం సంగతులు గుచ్చి గుచ్చి అడుగుతోంది మంగమ్మ. తగిలీ తగలనట్లు, తనకు తెలిసినంతవరకు సమా ధానా లిస్తూ కూర్చున్నాడు వంటింట్లో శ్రీధర్.

మంగమ్మ అప్పటికప్పు డొక పిండివంట చేసి భోజ నానికి లెమ్మన్నది. భోజనంచేస్తూ శ్రీధర్ తనకు వంద రూపాయిలు కావలసిన సంగతి బయటపెట్టాడు.

"నా దగ్గర అంత ఉందో లేదో నాయనా !.... చూస్తాను .... నువ్వెన్నాళ్లకు అడక్క అడక్క నోరు విడిచి అడిగితే లేదంటానా ? నాదగ్గర లేకపోతే మీ మామయ్య నడిగి రేపు సద్దుతాను.... ఊరినుంచి రాత్రికి వస్తా రాయన...." అన్నదామె.

భోజనం తర్వాత డబ్బు తెచ్చి యిచ్చింది. అందులో రూపాయనోట్లు, చిల్లర చాలభాగం ఉంది.

"పదులూ, అయిదులూ లేవా అత్తా ?"

"లేవు."

ఆ డబ్బుని జేబు రుమాల్లో ముడివేసుకుని బయల్దేర బోయాడు శ్రీధర్.

"అప్పుడే వెళ్లకపోతేనేం ? పక్కవేస్తాను, కాస్సేపు పడుకుని మూడు గంటలకి కాఫీ త్రాగి వెళ్దువుగానిలే .... ఎండగా ఉంది" అన్నది మంగమ్మ.

"లేదు, యిప్పుడే వెళ్లాలి .... పనుంది."

"ఎందుక్కావలసి వచ్చిందో డబ్బు ! ఇదిగో చూడు సిరీ ! దీన్ని తీసుకెళ్లి మీ యింటిలో అవసరాలకి సద్దితే మాత్రం నన్ను చంపుకుతిన్నంత ఒట్టు ! నీ సొంతానికి కావలసి వస్తేనే పట్టుకెళ్లి ఖర్చుపెట్టుకో, లేకుంటే యిట్లా యిచ్చేసి వెళ్ళు."

"లేదత్తా, యిది నా సొంతానికే ! ఒక స్నేహితుడికి బాకీపడ్డాను, పంపాలి ! ఆలస్యమైతే పోస్టాఫీసులో మని యార్డరు తీసుకోరు, వెళ్ళిరానా మరి !" అన్నాడు శ్రీధర్.

"అలాగే ! రోజా తీరిక చూసుకుని ఒకసారి వచ్చి పోతూ ఉండగూడదా సిరీ !"

"వస్తాలే అత్తా !" అని చిరునవ్వు నవ్వి ఆమెను సంతృప్తిపరచి బయలుదేరాడు శ్రీధర్.

సరాసరి కోమటి కొట్టుకు వెళ్లి చిల్లర యిచ్చివేసి అన్నీ అయిదు రూపాయల నోట్లుగా మార్చుకొని, డబ్బుని ఒక మడతగా జేబులో పెట్టుకున్నాడు. అప్పటికి కాని ఆదుర్దా తీరలేదు..... తర్వాత యింటికివెళ్లి పెట్టెతీసి ఆడబ్బు భద్రపరచి గదిలో మంచంమీద పడుకున్నాడు ఆలోచిస్తూ.

డబ్బు సమస్య తీరింది కాని అతనికి తను చేసిన పని సంతృప్తి నివ్వలేకపోయింది.

మంగమ్మత్త మాటలన్నీ జ్ఞాపకం వచ్చాయి. చివర ఆమె పెట్టిన ఒట్టు, దానికి తనిచ్చిన సమాధానమూ గుర్తు వచ్చి మనస్సును బాధించటం ప్రారంభించాయి .... తను అబద్ధం చెప్పేశాడు, తడుముకోకుండా, ఆలోచించకుండా ! మౌనం వహిస్తే పోయేది, కాని, తనకా నిబ్బరం లేకపోయింది.

మౌనం వహిస్తే మాత్రం ఎట్లా సరిపోయేది ఆమె ఒట్టు పెట్టిన తర్వాత ?.... నిజానికి, ఈ డబ్బు నాగరాజు యివ్వవలసిన దానికి ప్రతియే కావటంవల్ల, ఒకవిధంగా తను చెప్పినట్లు మంగమ్మత్త డబ్బు 'స్నేహితుడి కిచ్చినట్లే' అని దానికి సమాధానం .... వ్రతభంగం చేసుకుని యిలా సర్దు కోవటం దేనికి ? గాంధీగారు పాలు త్రాగనని శపథం చేసు కుని, తర్వాత మేకపాలు మాత్రం త్రాగినట్లు !..... బలహీన తలు ఎవరికైనా తప్పవు !.... కాని తన బలహీనత అలాంటిది కాదే ! .... తనకు తెలీకుండానే జరిగిపోతున్నాయి తను చేసే పనులు; మాటలూ అలానే జారిపోతున్నాయ్ ....

ఆలోచించకుండా ఆరోజు నాగరాజుతో ఉద్రేకంతో "మైలపడిన డబ్బు నా కక్కరలేదు" అని ఎలా అన్నాడో, ఈరోజు కూడా ఆలోచించకుండానే అబద్ధమాడి డబ్బు సంపాదించాడు ....

కాదు .... కాదు .... తను అబద్ధమేమీ ఆడలేదు ! తన అవసరానికి, బాకీ తీర్చటానికి అని కదా కారణాలు చెప్పాడు మంగమ్మతో. ఒకవిధంగా రెండూ నిజమే మరి ! తండ్రికి తనమీద కలిగిన అపోహ తీర్చటమే తన 'అవసరం', ఆయన యిచ్చిన డబ్బును తిరిగి యిచ్చెయ్యటమే బాకీ తీర్చటం, సరిపోలేదా ?

శ్రీధర్ ఆలోచనలు గుడిసుళ్లు తిరుగుతూనే ఉన్నాయి, సత్యం—అసత్యం, ఏదో నిర్ణయించటానికి ...... ప్రవాహంలో కొట్టుకుపోయే మనిషికి ఏ పూచికపుల్ల దొరికినా అండ దొరికినట్లే ఏదో ఒక యుక్తితో, తర్కంతో, తనని తను సమాధానపరచుకో ప్రయత్నించాడు శ్రీధర్ చాలసేపు. కాని ఎటూ తేలలేకపోయాడు.

(సశేషం)